మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 10-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 73 Issue: 73

10 సెప్టెంబర్ 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:07 సూర్యాస్తమయం - సా. 6:19 తిథి చతుర్దశి ఉ. 10:35 వరకు తరువాత అమావాస్య సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం మఖ మ. 2:03 వరకు తరువాత పూర్వ ఫల్గుని(పుబ్బ) యోగం సిద్ధ రా. 7:13 వరకు కరణం శకుని ఉ. 10:35 వరకు చతుష్పాద రా. 9:45 వరకు వర్జ్యం రా. 9:48 నుండి రా. 11:21 వరకు దుర్ముహూర్తం ఉ. 10:11 నుండి ఉ. 10:59 వరకు మ. 3:03 నుండి మ. 3:52 వరకు రాహుకాలం మ. 1:44 నుండి మ. 3:16 వరకు యమగండం ఉ. 6:07 నుండి ఉ. 7:38 వరకు గుళికాకాలం ఉ. 9:10 నుండి ఉ. 10:41 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:31 నుండి తె. 5:19 వరకు అమృత ఘడియలు ఉ. 11:46 నుండి మ. 1:17 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:37 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana Published from Jagitial




## శ్రీవారి భక్తులకు బీమా

**తిరుపతి దేవస్థానం బోర్డు**

తిరుమల, తిరుపతి దేవస్థానం బోర్డు భక్తుల కోసం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోనే ఏ ఆలయంలో లేని విధంగా భక్తులకు లైఫ్ ఇన్సూరెన్స్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. బుధవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు.

తిరుమల, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): ముఖ్యంగా శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు తిరుమలలో సహజ మరణం పొందితే భక్తుని కుటుంబానికి రూ.2 లక్షలు చెల్లించాలని నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్రతో చైర్మన్ మీడియాకు వివరించారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తోందని ఆయన తెలిపారు. ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు ముఖ్యాంశాలు తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు , అక్టోబర్ 12 నుంచి 20వతరువాయి 2 వ పేజీలో...

# ఫాంహౌజ్‌లో కుట్రలు..!

## కేసీఆర్ ఎర్రవెల్లి మీటింగ్‌పై విచారణ

**ఈ నెల 6 తర్వాతి పరిణామాలపైనా.. ఐపీఎస్ విజయ్ నేతృత్వంలో కమిటీ**

**నివేదిక ఆధారంగా క్రిమినల్ కేసులు.. ఉన్మాదుల్లా బీఆర్ఎస్ నేతల వ్యవహారం**

**అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన**



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లి నివాసంలో ఈ నెల 6న జరిగిన సమావేశం మొదలు మూడు రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఐపీఎస్ అధికారి విజయ్‌కుమార్‌ను విచారణ అధికారిగా నియమిస్తూ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటించారు. సెప్టెంబర్ 6న జరిగిన కుట్ర నుంచి ఆ తర్వాత చోటుచేసుకున్న అన్ని సంఘటనలను క్రోడీకరించి, బాధ్యులపై సంపూర్ణ విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేసి శిక్షించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): విద్యారంగంలో అక్రమాలు, ధరణి అక్రమాలు, 22 ఏ రాద్ధాంతంపై సభలో చర్చించాలని అనుకున్నామని సీఎం తెలిపారు. కానీ ఫామ్‌హౌస్‌లో కుట్ర చేసి తమ సభ్యులను సభను అడ్డుకునేందుకు ఉసిగొల్పారని ఆరోపించారు. సమస్యలపై చర్చ జరిగితే వారి పదేళ్ల దురాగతాలు, అప్పులపై ప్రజలకు అవగాహన కలుగుతుందని భయపడి చర్చ జరగకుండా కుట్ర చేశారని విమర్శించారు. అదే జరిగితే తెలంగాణ ప్రజలు ఇక శాశ్వతంగా వారి పార్టీని బొందపెడతారని అన్నారు. పార్లమెంట్‌పై దాడి చేసినవారికి, ముంబయి దాడులకు పాల్పడిన కసబ్‌కు, తరువాయి 2 వ పేజీలో...



## పోలీస్ ఉద్యోగాలకు వయోపరిమితి పెంపు

రాష్ట్రంలోని పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రిపేరవుతున్న అభ్యర్థులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. కానిస్టేబుల్ నియామకాల్లో వయోపరిమితి పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. నోటిఫికేషన్ ప్రకారం.. ఎస్ఐ ఉద్యోగాలకు వయోపరిమితి 32 ఏళ్లు, కానిస్టేబుల్ ఉద్యోగాలకు 29గా వయసు నిర్ధారించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): ఈ క్రమంలో రెండు పోస్టుల మధ్య వయసు తేడాపై నిరుద్యోగ అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. వయసు సమానం చేయాలంటూ నిరసనలు కూడా చేపట్టారు. ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు కూడా సమర్పించారు. చివరకు ప్రభుత్వం ఎస్సై అభ్యర్థులతో సమానంగా కానిస్టేబుల్ అభ్యర్థుల వయోపరిమితిని పెంచింది. పోలీసు, ఫైర్, జైళ్ల శాఖ, ఎస్పీఎఫ్ విభాగాల్లోని కానిస్టేబుళ్లకు ఈ నిర్ణయం అమలు కానుంది. కానిస్టేబుల్ (డ్రైవర్ పోస్టులకు) మాత్రం ప్రభుత్వం సడలింపు ఇవ్వలేదు.



# రైళ్లకు కేబినెట్ కూత!

## 9 రాష్ట్రాల్లో రూ.20,804 కోట్లతో రైల్వే ప్రాజెక్టులు

**ఏపీ, టీజీ సహా దక్షిణాదికి రూ.10,021 కోట్లు.. మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ నిర్ణయాలు**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా తొమ్మిది రాష్ట్రాల్లోని రూ.20,804 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్ట్‌లకు ఆమోదం తెలిపింది. దాదాపు 1,196 కిలోమీటర్ల మేర విస్తరించే ఈ ప్రాజెక్టుల ద్వారా రైలు అనుసంధానం (కనెక్టివిటీ) మెరుగుపడటంతో పాటు, ప్రస్తుత మార్గాల్లో రద్దీ తగ్గి ప్రయాణికులు, సరుకుల రవాణా వేగవంతం కానుంది.

న్యూఢిల్లీ: ఈ ప్రాజెక్టులను 2029-30 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టులు 'కనెక్టివిటీని పెంచడంతో పాటు ప్రయాణాన్ని సులభతరం చేస్తాయని, సరుకులు, ప్రయాణికుల రవాణాను వేగవంతం చేస్తాయని' ప్రభుత్వం తెలిపింది. ఈ ఎనిమిది ప్రాజెక్టులలో రూ. 10,021 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో 540 కిలోమీటర్ల తరువాయి 2 వ పేజీలో...



# మోదీ 'సిల్వర్ జూబ్లీ' మోత!

**సేవా సంకల్ప్ అభియాన్ పేరుతో నెల పాటు కార్యక్రమాలు.. ప్రకటించిన భారతీయ జనతా పార్టీ**

మోదీ ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. నెల రోజులపాటూ దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప అభియాన్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. బుధవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ మాట్లాడారు. అక్టోబర్ 7 నాటికి ప్రధాని మోదీ రాజ్యాంగబద్ధమైన ప్రజా జీవితంలోకి వచ్చి 25 ఏళ్లు పూర్తవుతుందని తెలిపారు.

న్యూఢిల్లీ: ప్రధాని ఈ సందర్భాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా రక్తదానం, స్వచ్ఛతా కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలతోపాటూ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రదర్శనలు, సదస్సులు వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మోదీ 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని, ఆయన పాలనా తీరు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రతిబింబించేలా ఫొటో, డిజిటల్ ప్రదర్శనలను సైతం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రధాని మోదీ పుట్టినరోజైన సెప్టెంబర్ 17 నుంచి సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలను తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,431 |
| వెండి (కిలో): | రూ.2,,55,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,569 |

## విశ్వవాణి



గాయాలు త్వరగా మానేందుకు అవసరమైన ప్రోటీన్లను నిరంతరం విడుదల చేసే ప్రత్యేక మానవ కణాలతో కూడిన ప్రయోగాత్మక ప్యాచ్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ కణాలను రోగనిరోధక వ్యవస్థ నుంచి రక్షించే సూక్ష్మ జెల్ కణాల్లో ఉంచి, గాయం వద్దే వాపును తగ్గించే, కొత్త రక్తనాళాల ఏర్పాటును ప్రోత్సహించే సంకేత ప్రోటీన్లను విడుదల చేసేలా రూపొందించారు. ఎలుకలు, పందులపై చేసిన పరీక్షల్లో ఈ ప్యాచ్ ఉపయోగించిన గాయాలు సాధారణ చికిత్సతో పోలిస్తే వేగంగా మానినట్లు గుర్తించారు. దీర్ఘకాలిక గాయాలు, మధుమేహ పుండ్లు వంటి సులభంగా మాయని గాయాలకు భవిష్యత్తులో ఈ సాంకేతికత ఉపయోగపడే అవకాశం ఉంది.



# ఖమ్మం మంత్రులు వసూల్ రాజాలు!

**ఒకరు సీఎం సీటుకే ఎసరు పెడుతున్నరు.. నేరుగా కేసీ వేణుగోపాల్‌కు డబ్బులు**

**మోదీ పైసలిస్తే పథకాలకు ఇందిరమ్మ స్టిక్కర్లు.. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపణలు**

ముగ్గురు ఖమ్మం మంత్రులు వసూళ్లలో బిజీగా ఉన్నారని, వారిలో ఒకరు ఏకంగా ముఖ్యమంత్రి సీటుకే ఎసరు పెడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. భద్రాచలంలో జరిగిన బీజేపీ ఆత్మీయ సమ్మేళనంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులపై తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని కాదని ఓ మంత్రి.. కేరళ ఎన్నికల కోసం కేసీ వేణుగోపాల్‌కు నేరుగా డబ్బులు పంపారని సంచలన వ్యాఖ్యలు చేశారు.

భద్రాచలం, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): కేంద్రం తెలంగాణకు వేల కోట్ల నిధులు ఇస్తుంటే.. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వాటన్నింటికీ ఇందిరమ్మ స్టిక్కర్లు వేసుకుంటోందని మండిపడ్డారు. ఈ ముగ్గురు మంత్రుల తీరుపై తాము సర్వే చేయించగా సంచలన విషయాలు బయటపడ్డాయని తెలిపారు. వీరు ఆషామాషీ నేతలు కారని, ఒకరు సీఎంకు రైట్ హ్యాండ్, మరొకరు లెఫ్ట్ హ్యాండ్ అని, ఇంకొకరు ఏకంగా ముఖ్యమంత్రి సీటులోనే కూర్చోవడానికి రెడీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. గతంలో ముఖ్యమంత్రి ద్వారా ఢిల్లీకి పైసలు వెళ్లేవని, కానీ ఇటీవలి కేరళ ఎన్నికల సమయంలో ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రి.. సీఎంతరువాయి 2 వ పేజీలో...



# రేవంత్ రెడ్డి ఆవేశం స్టార్

**ఆలోచన తక్కువ.. అక్కసు ఎక్కువ**

**ఫేక్ రాజకీయాలు చేస్తుండు**

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు ఫైర్**

అసెంబ్లీ వేదికగా ఫేక్ రాజకీయాలకు పాల్పడుతున్న సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డి రాజకీయం అక్కసు ఎక్కువ.. ఆలోచన తక్కువ ఉందని విమర్శించారు. విచక్షణ కోల్పోయి, వివేకం మరిచి 'ఫేక్' రాజకీయాలు చేస్తున్న ఆవేశం స్టార్ రేవంత్ రెడ్డి అని నిప్పులు చెరిగారు. సభా హక్కుల ఉల్లంఘనపై సభాధ్యక్షులు జోక్యం చేసుకోవాలి అని దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): 'రేవంత్ రెడ్డి తీరు చూస్తుంటే ఆయనకు బీఆర్ఎస్ పార్టీపై, కేసీఆర్ గారిపై ఉన్న అక్కసు, రాజకీయ ద్వేషం స్పష్టంగా కనిపిస్తున్నాయి తప్ప పాలనాపరమైన కనీస ఆలోచన, బాధ్యత ఎక్కడా కనిపించడం లేదు. చేతిలో ఇంటెలిజెన్స్, సీఐడీ, సైబర్ క్రైమ్ విభాగం వంటి సమస్త రాష్ట్ర నిఘా యంత్రాంగం ఉండి కూడా.. సభలో తాను చదువుతున్నది తరువాయి 2 వ పేజీలో...

# ప్రైవేట్ హాస్టళ్లపై 'హైడ్రా'!

## జనవరి నుంచి తనిఖీలు.. రంగనాథ్ హెచ్చరికలు



హైదరాబాద్ పరిధిలో జనవరి నుంచి ప్రైవేట్ హాస్టళ్ల తనిఖీలు చేపట్టనున్నట్లుగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. నగరంలో ప్రైవేట్ హాస్టళ్ల నిర్వహణ తీరుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా హాస్టళ్ల కోసం భవనాలను అద్దెకు ఇచ్చిన యజమానులతో హైడ్రా కమిషనర్ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. అయితే, ప్రైవేట్ హాస్టళ్ల నిర్వహణలో భద్రతా ప్రమాణాలు పాటించేందుకు నిర్వాహకులకు 3 నెలల పాటు గడువు ఇస్తున్నట్లుగా కమిషనర్ వెల్లడించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): ఈ నిర్ణీత గడువులోగా నిబంధనలను పూర్తిగా పాటించాలని స్పష్టం చేశారు. జనవరి నుంచి మున్సిపల్ కార్పొరేషన్ల సమన్వయంతో హాస్టళ్లలో విస్తృత తనిఖీలు చేపట్టనున్నట్లుగా తెలిపారు. నగరంలోని ప్రమాదకర భవనాల్లో హాస్టళ్లను నడపవద్దని కమిషనర్ రంగనాథ్ నిర్వాహకులకు హెచ్చరించారు. అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, ఎమర్జెన్సీ ఎగ్జిట్స్ లేని భవనాల్లో హాస్టళ్ల నిర్వహణను సహించేది లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించే భవనాలు, వాటి యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పబ్‌ల్లో భద్రతపై 'ఫైర్'

**నిబంధనలు పాటించాల్సిందే.. అగ్నిమాపకశాఖ ఆదేశాలు**



హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని పబ్‌లు, వినోద కేంద్రాల్లో ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని, అగ్నిమాపక నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందేనని తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా లో పబ్‌ల యాజమాన్యాలు, ప్రతినిధుల కోసం ఫైర్ సర్వీసెస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక భద్రత అనేది ప్రతి ఒక్కరి సమిష్టి బాధ్యతని డీజీ పేర్కొన్నారు. పబ్‌ల నిర్వాహకులు సకాలంలో ఫైర్ ఎన్‌ఓసీలు పొందడంతో పాటు ఎప్పటికప్పుడు తరువాయి 2 వ పేజీలో...




# వరుసగా 4 రోజులు బ్యాంకులు బంద్!

**రేపటి నుంచి బ్యాంకు సేవలకు అంతరాయం**

**శుక్రవారం సమ్మె.. తర్వాత రెండో శనివారం, ఆదివారం, సోమవారం వినాయకచవితి**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఈ నెల 11 నుంచి వరుసగా నాలుగు రోజుల పాటు బ్యాంకు సేవలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉంది. బ్యాంకు ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునివ్వడం, దానికి తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

10.9.2026

మేషం: నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. చేపట్టిన పనులను అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. ఉద్యోగమున అధికారులతో సఖ్యతగా వ్యవహరించడం మంచిది. చిన్ననాటి మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. బంధువర్గం నుండి ఆర్థిక సహాయం అందుతుంది. వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి.

వృషభం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. కుటుంబ సభ్యులతో అకారణ వివాదాలు తప్పవు. ఆస్తి వివాదాలు మానసిక చికాకును కలిగిస్తాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. వ్యాపార ఉద్యోగాలు మందగిస్తాయి. పనులలో జాప్యం కలుగుతుంది.

మిధునం: వ్యాపార విషయంలో ఆకస్మిక నిర్ణయాలు వలన నష్టాలు తప్పవు. చిన్ననాటి మిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. పుణ్యక్షేత్రాలు సందర్శించుకుంటారు. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి అధికమవుతుంది. ముఖ్యమైన పనులు శ్రమతో గాని పూర్తి కావు. కొన్ని వ్యవహారాలలో ఆలోచించి ముందుకు సాగడం మంచిది.

కర్కాటకం: స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి. చాలాకాలంగా పూర్తి కాని పనులను పూర్తి చేస్తారు. విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి.

సింహం: వ్యాపారాలు లాభాల బాటలో సాగుతాయి. అనుకున్న పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అవసరానికి ధన సహాయం లభిస్తుంది. ఉద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. మిత్రులతో శుభకార్యాలకు హాజరవుతారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: విద్యార్థుల కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తుంది. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. కుటుంబ సభ్యుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. బంధువర్గంతో వివాదాలు తప్పవు. వ్యాపార ఉద్యోగాలు ఆశించిన విధంగా సాగుతాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి.

తుల: వ్యాపార వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. బంధువులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఉద్యోగాలలో కొన్ని ఇబ్బందులు తప్పవు. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది.

వృశ్చికం: పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. స్థిరాస్తి కొనుగోలు అవరోధాలు తొలగుతాయి. వృత్తి వ్యాపారాలు సాఫీగా సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.ఆత్మీయులతో సఖ్యత పెరుగుతుంది. విందు వినోద కార్యక్రమాలకు ధనవ్యయం చేస్తారు.

ధనస్సు: వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. సన్నిహితులతో చిన్నపాటి వివాదాలు తప్పవు. ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ కలిగిస్తుంది. సోదరులతో ఒప్పందాలు వాయిదా వేస్తారు. ఉద్యోగాలలో కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ప్రయాణాలు వీలైనంతవరకు వాయిదా వేయటం మంచిది. దైవచింతన పెరుగుతుంది.

మకరం: చిన్ననాటి మిత్రులతో గృహమున సందడిగా గడుపుతారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి.

కుంభం: చేపట్టిన వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపార ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఎదురవుతాయి. ఆర్థిక వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబసభ్యులతో అకారణ మాటపట్టింపులు కలుగుతాయి.

మీనం: వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు కలిగినప్పటికి నిదానంగా పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో అధికారులు అనుగ్రహం కలుగుతుంది. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

# ఫాంహౌజ్‌లో కుట్రలు..!

**మొదటి పేజీ తరువాయి**

పుల్వామాలో సైనికులపై దాడిచేసిన తీవ్రవాదులకు, ఉన్మాదంతో సభాపతిని అవమానించిన వారికి పెద్ద తేడా లేదని సీఎం వ్యాఖ్యానించారు. ఉన్మాదానికి లోనై ఉసిగొల్పబడిన కొంతమంది ముష్కరులు అధికారులపై దాడులు చేయడంతోపాటు సభాపతి కుర్చీని అవమానించేలా వ్యవహరించారని ఆరోపించారు. వ్యక్తినే కాకుండా తల్లిని కూడా అవమానించారని అన్నారు. మహిళలను శక్తిగా కొలిచే సమాజం మనదని, భారతదేశాన్ని భారతమాతగా, తెలంగాణ రాష్ట్రాన్ని తెలంగాణ తల్లిగా భావిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. సభాపతిగా ఉన్న మీ మనసుకు గాయం చేయాలని ఉన్మాదంతో మాట్లాడారని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ సభాపతికి క్షమాపణ చెప్పి, వారి సభ్యులతో క్షమాపణ చెప్పించి సభ సజావుగా జరిగేలా చూస్తారని అంతా భావించారని, కానీ అలా జరగకపోగా మరింత ఉన్మాదంతో వ్యవహరించారని విమర్శించారు. కాంగ్రెస్ అంటే దేశంలో కోట్లాది ప్రజలకు ఒక నమ్మకం, ఒక భరోసా అని తెలిపారు. కాంగ్రెస్ ఏం చేసిందని అడిగేవారు పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ను ఒకసారి పరిశీలించాలన్నారు. కాంగ్రెస్ దూరదృష్టితో ఈ దేశం అభివృద్ధి చెందేలా ఎలాంటి చర్యలు తీసుకుందో అర్థమవుతుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని, ఇది కాంగ్రెస్ పార్టీ విధానమని పేర్కొన్నారు. కర్ణాటకలోని ఒక చిన్న గ్రామంలో పుట్టి, రజాకార్ల దాడుల్లో తండ్రిని కోల్పోయి, కార్మిక నాయకుడిగా రాణించి జాతీయ స్థాయికి ఎదిగిన నేత మల్లికార్జున ఖర్గే అని సీఎం కొనియాడారు. 60 ఏళ్లుగా ఒక్కరోజు కూడా విరామం లేకుండా ఆయన ప్రజల కోసం పనిచేస్తున్నారని అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఒక మైదానంలో జరిగిన సభలో మల్లికార్జున ఖర్గే పాల్గొంటే.. ఆగస్టు 10న బీజేపీ అనుబంధ సంస్థ అదే మైదానంలో శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టడం హేయమైన చర్య అని మండిపడ్డారు. దీన్ని సభ ముక్తకంఠంతో ఖండిస్తోందన్నారు. ఈ ఘటనపై ఖర్గే రాజ్యసభలో భావోద్వేగంతో ప్రధానిని అడిగి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారని తెలిపారు. పార్లమెంట్ సభ్యులు రాష్ట్రపతిని కలిసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారని చెప్పారు.

**దళితులను అవమానించారు**

ఏ ఫామ్‌హౌస్‌లో కుట్ర జరిగిందో ఆ ఫామ్‌హౌస్ ముందు దండోరా వేయాలని ప్రజాస్వామ్యవాదులు నిరసనకు దిగారని సీఎం చెప్పారు. వాళ్లలా ఉన్మాదానికి తెగబడలేదని, కేవలం డప్పు దరువులతో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపారని అన్నారు. దళిత సోదరులు తమ మనసులోని భావాన్ని వ్యక్తం చేసేందుకు డప్పును ఒక సాధనంగా ఉపయోగిస్తారని చెప్పారు. మిమ్మల్ని అవమానించినట్లుగా కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద వారిని అవమానించలేదని, దూషించలేదని అన్నారు. మమ్మల్ని బానిసలుగా భావించవద్దని, సహనాన్ని కోల్పోయేలా వ్యవహరించవద్దని మేల్కొలిపేందుకు అక్కడికి వెళ్లారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు లేదా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడిగా బాధలో ఉన్నవారి సమస్యను పరిష్కరించే బాధ్యత వారిపై ఉందని, ఆ ప్రతినిధులను లోపలికి పిలిచి మాట్లాడి జరిగిన సంఘటనపై కేసీఆర్ బాధ్యతతో వ్యవహరించాల్సి ఉండేదని అన్నారు. కానీ, అలా వ్యవహరించకుండా మళ్లీ ఉన్మాదంతో వ్యవహరించారని విమర్శించారు. దళితులు తిరిగిన నేలను శుద్ధి చేయాలని ఆదేశించి తీవ్రంగా అవమానించారని ఆరోపించారు.

**శుద్ధి చేయాల్సింది నేలను కాదు.. అహంకారాన్ని!**

అసలు మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. రాతి యుగంలో ఉన్న రాక్షసుల్లా వ్యవహరిస్తారా? అని సీఎం ప్రశ్నించారు. సమాజంలో అశాంతిని ప్రోత్సహించి రెండు జాతుల మధ్య వైరంగా మార్చాలని అనుకుంటున్నారని ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉండి, ధనబలంతో వ్యవస్థలను లొంగదీసుకోవాలనుకుంటున్నారని విమర్శించారు. వాళ్లు దళితులు నడిచిన నేలను శుద్ధిచేస్తే.. వారి మనసుల్లో పేరుకున్న అంటరానితనాన్ని ఎలా శుద్ధి చేయాలి అని ప్రశ్నించారు. నీళ్లతో కడగాలా? యాసిడ్‌తో కడగాలా? అని వ్యాఖ్యానించారు. దళితుడు దుక్కి దున్ని పంట పండిస్తే కడుపులు నిండుతున్నాయని అన్నారు. శుద్ధి చేయాల్సింది దళితులు నడిచిన నేలను కాదు.. మీ అహంకారం, అంటరానితనం ఆలోచనలను అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ మనసులో పేరుకుపోయిన దొర అహంకారాన్ని శుద్ధి చేయాల్సి ఉందన్నారు. ఈ బాధ్యతను తెలంగాణ సమాజం తీసుకుంటుందని సీఎం చెప్పారు. సభాపతిని అవమానించిన వారిని చట్టపరంగా శిక్షించాలని ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరిస్తుందని తెలిపారు. జరిగిన తప్పును ఒప్పుకుని క్షమాపణ చెబితే మీ కిరీటం ఊడి కింద పడుతుందా? అని ప్రశ్నించారు. ఒకవైపు మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానమైనా, గడ్డం ప్రసాద్‌కుమార్‌కు జరిగిన అవమానమైనా ఈ సమాజానికి జరిగినట్లేనని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇంకా కొంతమంది మనసుల్లో పేరుకున్న మనువాద భావాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని చెప్పారు.

**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం చర్యలు**

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం ఎంతటివారినైనా ప్రభుత్వం విచారణ చేపట్టి శిక్షించాలని నిర్ణయించిందని సీఎం తెలిపారు. కుట్రలు పన్నినవారితో పాటు కుట్రలో భాగస్వాములైన వారిని చట్టపరిధిలో శిక్షించాలని నిర్ణయించామని చెప్పారు. సెప్టెంబర్ 6న జరిగిన కుట్ర నుంచి జరిగిన అన్ని సంఘటనలను క్రోడీకరించి అందరిపై సంపూర్ణ విచారణ చేసి, క్రిమినల్ కేసులు పెట్టి శిక్షించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సభాపతిగా తమరు మానసిక ధైర్యం కోల్పోవద్దని, మీ మనసును గాయపరిచిన వారిని వదిలే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. చట్టాలు, సెక్షన్లు అడ్డుపెట్టుకుని కొంతమందికి బెయిల్ పొందొచ్చని.. కానీ తెలంగాణ సమాజం బెయిల్ ఇవ్వదని రేవంత్‌రెడ్డి అన్నారు. రజాకార్లను దిగంతాలకు తరిమి మట్టికరిపించిన చరిత్ర ఈ గడ్డదని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం అండగా నిలబడుతుందని సభాపతికి భరోసా ఇచ్చారు.



# రేవంత్ రెడ్డి ఆవేశం స్టార్

**మొదటి పేజీ తరువాయి**

అధికారిక దస్త్రమా లేక ఏదో పెయిడ్ ట్రోల్ ముఠా సృష్టించిన బోగస్ ఖాతా పోస్టా అని నిర్ధారించుకోలేకపోవడం క్షమించరాని నిర్లక్ష్యం. విచక్షణారహితంగా వ్యవహరించడం ఆయన ఆలోచనా దారిద్ర్యానికి నిదర్శనం. శాసనసభ రికార్డులకు చట్టబద్ధమైన పవిత్రత ఉంటుంది. ధ్రువీకరించని, తప్పుడు కల్పిత సోషల్ మీడియా స్క్రీన్‌షాట్లను సభ రికార్డుల్లోకి ఎక్కించడం ముమ్మాటికీ ప్రివిలేజ్ (సభా హక్కుల) ఉల్లంఘనే. ముఖ్యమంత్రి పదవికి ఉండే రాజ్యాంగ గౌరవాన్ని గాలికొదిలేసి, సభను కాంగ్రెస్ వార్‌రూమ్ ట్రోల్ పేజీ స్థాయికి దిగజార్చారు. నిజంగా ఆ పోస్టుపై నమ్మకం ఉంటే, దాని అసలు కర్త ఎవరు, ఆ ఖాతా ఎక్కడి నుంచి ఆపరేట్ అవుతోందో సైబర్ క్రైమ్ పోలీసులతో విచారణ చేయించే దమ్ము ప్రభుత్వానికి ఉందా? ఏది సత్యం, ఏది అసత్యం అనే కనీస 'విచక్షణ' లేకుండా, ప్రతిపక్షాన్ని ఇరుకున పెట్టాలన్న గుడ్డి కసితో అసెంబ్లీ నిబంధనలను సైతం తుంగలో తొక్కుతున్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజం, కానీ ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీలో నిలబడి ఫేక్ ట్వీట్లను ఆధారం చేసుకుని మాట్లాడటం ఆయన వద్ద ఎలాంటి వాస్తవాలు, ఆధారాలు లేవనడానికి ప్రత్యక్ష సాక్ష్యం. ఆయనకున్న 'వివేకం' ఎంతటిదో ఈ ఒక్క ఘటనే తేటతెల్లం చేసింది. ప్రజలు అప్పగించిన రాజ్యాంగ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాల్సింది పోయి, నిత్యం మైకుల ముందు తొడలు కొడుతూ, సినీ ఫక్కీలో ఊగిపోయే 'ఆవేశం స్టార్'గా రేవంత్ రెడ్డి మారిపోయారు. కళ్లబొల్లి మాటలు, అసత్యాల ఆవేశం మైకుల వరకే పరిమితం తప్ప ప్రజల కడుపు నింపలేవు. ఆవేశంలో అబద్ధాలు ప్రచారం చేయడం, పచ్చి అబద్ధాలతో ప్రత్యర్థులపై విషం కక్కడం ఆయన నిత్య నైజంగా మారింది. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తన 'ఫేక్' రాజకీయాలకు స్వస్తి పలికి, శాసనసభను తప్పుదోవ పట్టించినందుకు సభకు, తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. చిల్లర సోషల్ మీడియా ట్రోలింగ్ ఆపి, ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి సారిస్తే రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుంది' అని పేర్కొన్నారు.

# ఖమ్మం మంత్రులు వసూల్ రాజాలు!

**మొదటి పేజీ తరువాయి**

రేవంత్ రెడ్డిని సైతం పక్కనపెట్టి నేరుగా కేసీ వేణుగోపాల్‌కు డబ్బులు ఇచ్చారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ పరిణామంతో సీఎంకు, సదరు మంత్రికి మధ్య ఆధిపత్య పోరు మొదలైందని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ వేల కోట్ల రూపాయలు ఇస్తున్నారని గుర్తుచేశారు. భద్రాద్రి ప్రసాదం స్కీం కింద రూ.41 కోట్లు, ఖమ్మం-వైరా హైవేకి రూ.4,000 కోట్లు, మల్కానిగిరి-పాండురంగాపురం కొత్త రైల్వే లైన్‌కు రూ.3,600 కోట్లు, ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రూ.8 వేల కోట్లు కేంద్రమే ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, ఉచిత బియ్యం, గ్యాస్, కిసాన్ సమ్మాన్ నిధి వంటివన్నీ కేంద్ర ప్రభుత్వానివేనని, కానీ రాష్ట్ర కాంగ్రెస్ నేతలు మాత్రం వాటన్నింటికీ ఇందిరమ్మ స్టిక్కర్లు వేసుకుని రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

**ఎయిర్‌పోర్టుకు అడ్డం పడుతున్నరు**

కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం అనుకూలమైన స్థలం కేటాయించకుండా నాటకాలు ఆడుతోందని బండి సంజయ్ విమర్శించారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు పవర్‌ఫుల్ మంత్రులున్నా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఒక్క పైసా తీసుకురాలేకపోయారని దుయ్యబట్టారు. అదే కరీంనగర్‌లో బీజేపీ గెలిచిన వంద రోజుల్లోనే అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద రూ.830 కోట్లు, అమృత్ కింద రూ.140 కోట్లు, యూడీఎఫ్ కింద రూ.50 కోట్లు.. ఇలా వందల కోట్ల నిధులు తీసుకొచ్చామని వివరించారు. ఎవరికి ప్రజల మీద చిత్తశుద్ధి ఉందో, ఎవరు పేరు మార్చుకుని రాజకీయం చేస్తున్నారో ప్రజలే గమనించాలని అన్నారు.

# శ్రీవారి భక్తులకు బీమా

**మొదటి పేజీ తరువాయి**

తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని వెల్లడించారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని వివరించారు. రిలయన్స్ సంస్థ టీటీడీకి విరాళంగా అందించిన 25 ఎలక్ట్రిక్ బస్సులను సెప్టెంబర్ 16న చంద్రబాబు ప్రారంభించనున్నారని తెలిపారు. అదే కార్యక్రమంలో 2027 సంవత్సరానికి సంబంధించిన టీటీడీ క్యాలెండర్లు, డైరీలను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారన్నారు. భక్తులు, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, తిరుమలలో ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు అందించే బీమాను రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచేందుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సమావేశంలో టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, జేఈవోలు డా.ఎ.శరత్, శ ప్రభల గోపినాథ్, సీవీఎస్వో కే వి మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పబ్‌ల్లో భద్రతపై 'ఫైర్'

**మొదటి పేజీ తరువాయి**

రెన్యువల్ చేసుకోవాలని, అగ్నిమాపక యంత్రాలు నిరంతరం పనిచేసే స్థితిలో ఉండేలా చూసుకోవాలని సూచించారు. అత్యవసర మార్గాల్లో ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని, విపత్కర పరిస్థితుల్లో స్పందించేలా సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఇటీవల హైదరాబాద్ నగరవ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైన వివరాలను ఈ సందర్భంగా అధికారులు బహిర్గతం చేశారు. నగర పరిధిలోని మొత్తం 77 పబ్‌లలో క్షేత్రస్థాయి పరిశీలన జరపగా, అందులో 45 పబ్‌లు మాత్రమే చెల్లుబాటు అయ్యే ఫైర్ ఎన్ఓసీలు కలిగి ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన 32 పబ్‌లు సరైన ఫైర్ ఎన్ఓసీ లేకుండా నిర్వహించడం లేదా భద్రతా లోపాలు కలిగి ఉన్నట్లు తేలింది. నిబంధనలను ఉల్లంఘించిన ఈ 32 సంస్థలకు ఇప్పటికే అధికారిక నోటీసులు జారీ చేశామని అధికారులు తెలిపారు. నిర్దేశిత గడువులోగా భద్రతా లోపాలను సరిదిద్దుకోకపోతే తెలంగాణ ఫైర్ సర్వీస్ చట్టం ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో వెలుగుచూసిన లోపాలపై పబ్ నిర్వాహకులకు అధికారులు సమగ్ర అవగాహన కల్పించారు. పనిచేయని ఫైర్ అలారాలు, స్ప్రింక్లర్లు, అత్యవసర ద్వారాలకు అడ్డంకులు, అత్యవసర లైటింగ్ ఎగ్జిట్ సూచికలు లేకపోవడం, అస్తవ్యస్త విద్యుత్ వైరింగ్ వంటి సమస్యలను తక్షణమే సరిదిద్దుకోవాలని సూచించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌ల నివారణ, రద్దీ నియంత్రణ పద్ధతులను వివరించారు. అత్యవసర సమయాల్లో వినియోగదారులను సురక్షితంగా బయటకు తరలించేలా సిబ్బందికి ముందస్తు శిక్షణ ఇవ్వాలని, క్రమం తప్పకుండా మాక్ డ్రిల్స్ నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చే ప్రాంతాల్లో నిరంతర తనిఖీలు కొనసాగుతాయని ఫైర్ శాఖ స్పష్టం చేసింది.

# మోదీ 'సిల్వర్ జూబ్లీ' మోత!

**మొదటి పేజీ తరువాయి**

ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. వచ్చే అక్టోబర్ 17 వరకూ దేశవ్యాప్తంగా ఇవి కొనసాగుతాయని స్పష్టం చేశారు. మోదీ అక్టోబర్ 7, 2001న తొలిసారి గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2014 వరకు గుజరాత్ సీఎంగానే కొనసాగారు. అనంతరం 2014 మే 26న భారత ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టి, అప్పటి నుంచి ప్రధానిగా కొనసాగుతున్నారు. ఈ ఏడాది అక్టోబర్ 7 నాటికి మోదీ రాజ్యాంగబద్ధమైన ప్రజా జీవితంలోకి వచ్చి 25 ఏళ్లు పూర్తి కానుంది.

# రైళ్లకు కేబినెట్ కూత!

**మొదటి పేజీ తరువాయి**

మేర విస్తరించి ఉన్నాయి. అరక్కోణం - రేణిగుంట మూడు, నాలుగో లైన్లు (77 కి.మీ), వైట్‌ఫీల్డ్ - బంగారపేట మూడు, నాలుగో లైన్లు (47 కి.మీ), హోసూర్ - ఓమలూర్ డబ్లింగ్ (147 కి.మీ), సేలం - కరూర్ - దిండిగల్ డబ్లింగ్ (159 కి.మీ), సికింద్రాబాద్ (ఘట్‌కేసర్) - కాజీపేట మల్టీట్రాకింగ్ (110 కి.మీ). మిగిలిన రూ.10,783 కోట్ల విలువైన మూడు ప్రాజెక్టులు పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో 656 కిలోమీటర్ల మేర విస్తరిస్తాయి. ఖరగ్‌పూర్ - ఝూర్సుగూడ (బాగ్దేహి) నాలుగో లైన్, కట్నీ - పెండ్రా రోడ్ నాలుగో లైన్, బిలాస్‌పూర్ (ఉస్లాపూర్) - పెండ్రా రోడ్ మూడో లైన్ ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లోని ఐదు ప్రాజెక్టులు 17 జిల్లాల గుండా వెళ్తూ, 2,121 గ్రామాలకు రైలు సౌకర్యాన్ని కల్పిస్తాయి. దీని ద్వారా దాదాపు 52 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. తూర్పు, మధ్య భారతదేశంలోని మూడు ప్రాజెక్టులు 14 జిల్లాలను కవర్ చేస్తూ, దాదాపు 56 లక్షల జనాభా ఉన్న 4,790 గ్రామాలను అనుసంధానిస్తాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా ఏటా దాదాపు 74 మిలియన్ టన్నుల మేర సరుకుల రవాణా సామర్థ్యం పెరుగుతుందని అంచనా. నవీకరించిన ఈ మార్గాలు బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు, కంటైనర్లు, ఆటోమొబైల్స్, ఆహార ధాన్యాలు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎరువుల రవాణాకు ఎంతగానో తోడ్పడతాయి. 'పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్' కింద చేపట్టే ఈ ప్రాజెక్టుల ద్వారా తిరుపతితో పాటు తమిళనాడు, కర్ణాటకలోని పలు ప్రధాన ఆలయాలు, ముఖ్యమైన పర్యాటక, పుణ్యక్షేత్రాలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని ప్రభుత్వం తెలిపింది. అంతేకాకుండా ఈ ప్రాజెక్టుల వల్ల దాదాపు 20 కోట్ల లీటర్ల చమురు దిగుమతులు తగ్గడమే కాకుండా దాదాపు 104 కోట్ల కిలోల కర్బన ఉద్గారాలు తగ్గుతాయని అంచనా. ఈ ఉద్గారాల తగ్గింపు దాదాపు 4.48 కోట్ల చెట్లు పీల్చుకునే కార్బన్ సామర్థ్యంతో సమానమని పేర్కొంది.

# వరుసగా 4 రోజులు బ్యాంకులు బంద్!

**మొదటి పేజీ తరువాయి**

వరుస సెలవులు జత కలవడమే ఇందుకు కారణం. దీంతో ముఖ్యమైన ఆర్థిక లావాదేవీలు ఉన్నవారు ముందుగానే తమ పనులను పూర్తి చేసుకోవాలని బ్యాంకులు సూచిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే, తమ ప్రధాన డిమాండ్ల సాధన కోసం యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ సమ్మెకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 11న దేశవ్యాప్తంగా ఒకరోజు సమ్మె చేపట్టనుంది. ఆ తర్వాత రోజు సెప్టెంబర్ 12 రెండో శనివారం, సెప్టెంబర్ 13 ఆదివారం సాధారణ సెలవులు. ఇక సెప్టెంబర్ 14, సోమవారం వినాయక చవితి పండుగ సందర్భంగా పలు రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవు ప్రకటించారు. దీంతో శుక్రవారం నుంచి సోమవారం వరకు వరుసగా నాలుగు రోజులు బ్యాంకులు మూతపడనున్నాయి. వారానికి 5 రోజుల పనిదినాలను అమలు చేయాలన్నది బ్యాంకు ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్‌గా ఉంది. దీనిపై 2024లోనే సూత్రప్రాయ అంగీకారం కుదిరినప్పటికీ, అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని యూనియన్లు ఆరోపిస్తున్నాయి. దీంతో పాటు, సవరించిన పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల పథకాన్ని సమీక్షించాలని, పెన్షన్ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాయి. ఈ విషయమై సెప్టెంబర్ 9న ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్, ప్రభుత్వ అధికారులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో సమ్మెను వాయిదా వేయాలని అధికారులు కోరినా, స్పష్టమైన హామీ లభించకపోవడంతో యూనియన్లు అందుకు నిరాకరించాయి. డిమాండ్లు నెరవేరని పక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని యూఎఫ్ బీయూ హెచ్చరించింది. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు, అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని స్పష్టం చేసింది. ఈ సమ్మె ప్రభావం ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులపై అధికంగా ఉండనుంది.

## ముున్సిపల్ డ్రైవర్‌కు రూ.3 లక్షల ఎల్వోసీ

జగిత్యాల, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న జగిత్యాల మున్సిపల్ డ్రైవర్ జుట్టు జగన్ కుటుంబానికి ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ అండగా నిలిచారు. జగన్ అనారోగ్య పరిస్థితిని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.3 లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే.. హైదరాబాద్‌లో జగన్ కుటుంబ సభ్యులకు ఎల్ఓసీని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి వరంలాంటిదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో తాళ్ల ధర్మారం మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇదెక్కడి వింత..?

**తిరుమలలో ఉన్న మల్లారెడ్డి సస్పెండ్**

**సర్కారుపై తలసాని మండిపాటు**



హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ వేటుపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీని తీవ్రంగా అభాసుపాలు చేస్తోందని, ప్రజా సమస్యలు, కీలకమైన జీవో 97, 22-ఏ వంటి అంశాలపై చర్చ జరగకుండా తప్పించుకునేందుకే విపక్ష సభ్యులను సస్పెండ్ చేస్తోందని ఆరోపించారు. సభకు రాకుండా తిరుమల పర్యటనలో ఉన్న మల్లారెడ్డితో పాటు, సభలో లేని పద్మారావు గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, కేటీఆర్, గంగుల కమలాకర్ పేర్లను కూడా సస్పెన్షన్ జాబితాలో చేర్చడం శాసనసభా చరిత్రలోనే హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. శాసనసభా వ్యవహారాల మంత్రి చదివిన జాబితా ఒకటైతే, స్పీకర్ ప్రకటించిన పేర్లు మరో విధంగా ఉన్నాయని తప్పుబట్టారు.




## ఆయుష్ విద్యార్థుల స్టైపెండ్ డబుల్

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): తెలంగాణలోని ఆయుష్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి విభాగాల్లో ప్రాక్టీస్ చేస్తున్న హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైపెండ్‌ను భారీగా పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. అల్లోపతి మెడికోలతో సమానంగా వీరికి కూడా స్టైపెండ్ పెంచుతూ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం అధికారిక జీవో జారీ చేశారు. తాజా జీవో ప్రకారం.. ఇప్పటివరకు హౌస్ సర్జన్లకు నెలకు అందుతున్న రూ.13,754 స్టైపెండ్‌ను రూ.29,792 కు పెంచారు. అలాగే, పీజీ విద్యార్థుల గౌరవ వేతనం రూ.34,385 నుంచి ఏకంగా రూ.74,482 కు చేరింది. స్టైపెండ్‌ను డబుల్ చేయడం పట్ల ఆయుష్ విద్యార్థులు, డాక్టర్లు ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం సచివాలయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వారికి స్వయంగా జీవో కాపీని అందజేశారు. పదేళ్ల గత ప్రభుత్వ పాలనలో తమ స్టైపెండ్ ఒక్క రూపాయి కూడా పెరగలేదని, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడ్డామని విద్యార్థులు గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు అల్లోపతి డాక్టర్లతో సమానంగా తమను గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రికి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ దిశానిర్దేశం చేశారు. మంచి వైద్యులుగా ఎదిగి పేదలకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు.

## క్షుద్ర వ్యాఖ్యలపై చేసినవారిపై చర్యలు

**చర్యలకు డీజీపీకి ఎన్‌హెచ్ఆర్సీ ఆదేశాలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావుపై బహిరంగంగా "బ్లాక్ మేజిక్", "క్షుద్ర పూజలు" ఆరోపణలు చేసిన వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు కాకపోవడంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) లో న్యాయవాది, సామాజిక వేత్త కారుపోతుల రేవంత్ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును ఎన్‌హెచ్ఆర్సీ విచారణకు స్వీకరించింది. నాలుగు వారాల్లోగా "యాక్షన్ టేకెన్ రిపోర్ట్" సమర్పించాలని తెలంగాణ డీజీపీని కమిషన్ బుధవారం ఆదేశించింది. హరీశ్‌రావు తరఫున ఆయన అనుమతితో, హైకోర్టు న్యాయవాది కారుపోతుల రేవంత్ మానవ హక్కుల పరిరక్షణ చట్టం, 1993లోని సెక్షన్ 12(ఖ) కింద 22.08.2026న ఈ ఫిర్యాదును దాఖలు చేశారు. 2026 జూలై 31 నుంచి ముఖ్యమంత్రి, ప్రభుత్వ విప్ సహా ఉన్నత పదవుల్లో ఉన్నవారు.. వర్షాలు ఆగిపోయేందుకు, కరువు రావడానికి హరీశ్‌రావు ఆలయాల్లో తాంత్రిక పూజలు జరిపించారంటూ పదేపదే బహిరంగ ఆరోపణలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏ ఒక్క ఆలయ రికార్డు, పూజారి, రసీదు లేదా సాక్షి ఇప్పటివరకు బహిర్గతం కాలేదని తెలిపారు.

## పీఆర్సీ రిపోర్టుకు ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ రేపు చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చి సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉద్యోగ సంఘాల నేతలను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం మధ్యాహ్నం చర్చలకు ఆహ్వానించింది. టీజీఈజేఏసీ చైర్మన్ వి లచ్చిరెడ్డితో పాటు పలువురు నాయకులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో చర్చలు జరిపారు. ఈ నెల 18 లోపు పీఆర్సీ రిపోర్టు సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎస్‌ను ఉద్యోగ సంఘాల నేతలు కోరారు. దీనిపై తక్షణమే స్పందించిన సీఎస్.. పీఆర్సీ రిపోర్టును వీలైనంత త్వరగా సమర్పించాలని సెకండ్ పే రివిజన్ కమిషన్ చైర్మన్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పీఆర్సీ ప్రక్రియలో ముందడుగు పడినట్లుగా జేఏసీ భావిస్తున్నది. సీపీఎస్ రద్దుపై అధ్యయన కమిటీ ఏర్పాటు అంశంపై ప్రభుత్వం, టీజీఈజేఏసీ మధ్య చర్చ జరిగింది. ఉద్యోగులకు ఓపీఎస్ పునరుద్ధరణ చేయాలని జేఏసీ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలపై సెప్టెంబర్ 18న స్పష్టత ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే పూర్తి స్థాయిలో హెల్త్ కార్డు అమలు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు లేవనెత్తిన ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, జేఏసీ మధ్య చర్చల ప్రక్రియను కొనసాగించాలని కోరారు. ఈ పరిణామాల నేపథ్యంలో గురువారం నాటి చలో హైదరాబాద్

# జెప్టో-ప్రభుత్వం ఆధ్వర్యంలో 'ప్రాజెక్ట్ ప్రగతి'

## 5 చోట్ల డెలివరీ బాయ్స్ అలసట తీర్చే కేంద్రాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): హైదరాబాద్ మహా నగరంలో ఎండ, వాన, ట్రాఫిక్‌ను లెక్కచేయకుండా నిత్యం రోడ్లపై తిరుగుతూ ఆర్డర్లు డెలివరీ చేసే గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం కీలక సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. డెలివరీ బాయ్స్‌తో పాటు ఇతర గిగ్ వర్కర్లకు పని సమయంలో కొంతసేపు విశ్రాంతి తీసుకునేందుకు.. ప్రాథమిక అవసరాలు తీర్చుకునేందుకు హైదరాబాద్‌లో 5 అత్యాధునిక ప్రగతి కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం, క్విక్ కామర్స్ సంస్థ జెప్టో మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న ఈ కేంద్రాలను అన్ని ప్లాట్‌ఫామ్‌లకు చెందిన గిగ్ కార్మికులు వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించారు. క్విక్ కామర్స్, ఫుడ్ డెలివరీ, ఈ-కామర్స్, దుస్తుల డెలివరీ, ఇతర లాస్ట్-మైల్ డెలివరీ రంగాల్లో పనిచేసే కార్మికులు రోజులో ఎక్కువ సమయం రోడ్లపైనే గడుపుతుంటారు. ఎండ, వర్షం, ట్రాఫిక్ మధ్య పనిచేసే వీరికి విశ్రాంతి తీసుకునేందుకు.. తాగునీరు, టాయిలెట్ల వంటి కనీస సౌకర్యాలు పొందేందుకు అనేక ప్రాంతాల్లో సరైన వసతులు ఉండటం లేదు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రగతి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. పనివేళల్లో కొంతసేపు సేదతీరేందుకు కార్మికులు ఈ కేంద్రాలను ఉపయోగించుకోవచ్చు. ప్రతి ప్రగతి కేంద్రంలో గిగ్ వర్కర్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పలు సదుపాయాలను కల్పించనున్నారు. అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ విశ్రాంతి తీసుకునే స్థలం, శుభ్రమైన తాగునీరు, టాయిలెట్ సదుపాయం, ఫస్ట్ ఎయిడ్ వంటి వసతులు అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా మొబైల్ ఫోన్లు ఛార్జ్ చేసుకునే పాయింట్లు, వైఫై కనెక్టివిటీ కూడా ఏర్పాటు చేయనున్నారు. పని మధ్యలో ఫోన్ బ్యాటరీ అయిపోవడం డెలివరీ కార్మికులకు ఇబ్బందిగా మారుతుంటుంది. ఈ నేపథ్యంలో ఛార్జింగ్ సదుపాయం వారికి ఉపయోగపడనుంది. ప్రగతి కేంద్రాల్లో ఎప్పటికప్పుడు ఆరోగ్య శిబిరాలను కూడా నిర్వహించనున్నారు. రోజంతా రోడ్లపై పనిచేసే కార్మికులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన ప్రాథమిక వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకోనున్నారు. అర్హత కలిగిన గిగ్, అసంఘటిత రంగ కార్మికులకు ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్‌పై కూడా అవగాహన కల్పించనున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సామాజిక భద్రతా కార్యక్రమాలపై సమాచారం అందించేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడనున్నాయి. నగరంలోని గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గతంలో నిర్వహించిన ఒక సర్వే కూడా వెల్లడించింది. 2024లో 166 మంది గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులపై నిర్వహించిన ఎమ్ఫ్‌భ్ఎష్ట్ర సర్వేలో దాదాపు 69 శాతం మందికి శుభ్రమైన వాష్‌రూమ్‌లు అందుబాటులో లేవని తేలింది. 80 శాతానికి పైగా కార్మికులకు పనిచేసే సమయంలో నీడ, వేడి నుంచి ఉపశమనం పొందే సదుపాయాలు లేవని సర్వే పేర్కొంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రగతి కేంద్రాల ఏర్పాటు గిగ్ కార్మికులకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రగతి కేంద్రాలకు అవసరమైన నిధులను సమకూర్చడంతో పాటు వాటి నిర్వహణను కూడా జెప్టో సంస్థ చేపట్టనుంది. కేంద్రాలను ఎక్కడ ఏర్పాటు చేయాలన్న విషయంపై తెలంగాణ ప్రభుత్వం, జెప్టో సంయుక్తంగా నిర్ణయం తీసుకుంటాయి. ప్రాంతాన్ని బట్టి ప్రతి కేంద్రానికి రోజులో వందలాది మంది కార్మికులు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# అసెంబ్లీ కాదు.. కౌరవ సభ

**రాజ్యాంగం, కోర్టులపై సర్కారుకు గౌరవం లేదు.. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. గవర్నర్‌కు కాంగ్రెస్ సర్కారు తీరుపై ఫిర్యాదు**



హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'అది శాసనసభ కాదు.. కౌరవ సభ. సభ కాదు.. దుశ్శాసన సభ' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగం, కోర్టులపై గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు బుధవారం రాష్ట్ర గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను కలిశారు. రాష్ట్రంలోని తాజా పరిణామాలు, తమపై జరిగిన దాడులు, అసెంబ్లీలో చోటుచేసుకున్న ఘటనలను ఆధారాలతో వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ 1000 హామీలతో అధికారంలోకి వచ్చి.. 1000 రోజులుగా హామీలను అమలు చేయడంలో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. పరిపాలనలోనూ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు, నిరుద్యోగ విద్యార్థులు, యువత, పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రాహుల్‌గాంధీ నిరుద్యోగ విద్యార్థులు, యువతను ఏ విధంగా మోసం చేశారో కూడా వివరించామన్నారు. శాసనసభ సమావేశాల తొలిరోజు తమపై ప్రభుత్వ ఆధ్వర్యంలో పోలీసులు చేసిన దాష్టీకాన్ని గవర్నర్‌కు వివరించామని కేటీఆర్ చెప్పారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపిన తీరులోనే టీషర్ట్‌ల ద్వారా నిరసన తెలపాలని తాము అనుకున్నామని తెలిపారు. అయితే తమ హక్కులను కాలరాస్తూ శాసనసభ్యులమైన తమను సభలోకి రానివ్వకుండా రోడ్డుపైనే అడ్డుకున్నారని ఆరోపించారు. తమపై జరిగిన దాడికి సంబంధించిన ఫొటోలు, ఆధారాలను గవర్నర్‌కు అందించామని చెప్పారు. ముఖ్యంగా మహిళా శాసనసభ్యులపై జరిగిన దాడిని వివరించామన్నారు. తమ మహిళా నాయకురాలు సునీతా లక్ష్మారెడ్డి చీరను లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపిన తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. తమపై దాడి చేసి.. తిరిగి తమనే బద్నాం చేస్తున్న కాంగ్రెస్ కుట్రను కూడా వివరించామన్నారు. శాసనసభ వ్యవహారాలతో పాటు బయట జరిగిన ప్రతి సంఘటనపైనా, తాము చెప్పిన ప్రతి అంశంపైనా విచారణ జరిపిస్తామని గవర్నర్ హామీ ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. గవర్నర్ ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం జరుగుతున్న దౌర్జన్యకాండలో ఆయన జోక్యం చేసుకుంటారని భావిస్తున్నామని చెప్పారు. తెలంగాణ ప్రజల తరఫున న్యాయం అడిగి.. హామీలు అమలు చేయాలని కోరినందుకే తమపై దాడులు చేశారని గవర్నర్‌కు తెలియజేశామని అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన అన్ని ాూ× ఫొటోలు, వీడియోలపై ఇప్పటికే ఫిర్యాదు చేశామని తెలిపారు. తప్పుడు చిత్రాలు, తప్పుడు ఫిర్యాదులు ఉపయోగించే వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణలో న్యాయం జరగకుంటే జాతీయ స్థాయిలో జాతీయ మహిళా కమిషన్‌ను కూడా ఆశ్రయించి ఫిర్యాదు చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.



## జగన్ పాదయాత్ర 2కు ముహూర్తం ఖరారు

**2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో యాత్ర ప్రారంభం**

**బాపట్ల జిల్లా పర్చూరు కార్యకర్తల సమావేశంలో ప్రకటన**

బాపట్ల, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లేందుకు ఆయన ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా తాను చేపట్టబోయే రెండో విడత పాదయాత్రకు ముహూర్తం ఖరారు చేశారు. 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని స్పష్టత ఇచ్చారు. నేడు బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల సమావేశంలో జగన్ ఈ కీలక ప్రకటన చేశారు. గతంలో అధికారం కోసం జగన్ ఇదే ఫార్ములాను అనుసరించిన విషయం తెలిసిందే. 2017 నవంబర్ 6న కడప జిల్లా ఇడుపులపాయలో 'ప్రజా సంకల్ప యాత్ర' పేరుతో ఆయన తన తొలి పాదయాత్రను ప్రారంభించారు. ఆ యాత్ర 341 రోజుల పాటు ఏకధాటిగా సాగి, 3,648 కిలోమీటర్ల దూరం కొనసాగింది. 2019 జనవరి 9న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో యాత్ర ముగిసింది. ఈ యాత్రలో భాగంగానే ఆయన 'నవరత్నాలు' పథకాలను ప్రకటించారు. ప్రజల నుంచి వచ్చిన అపూర్వ స్పందన, యాత్రలో తెలుసుకున్న సమస్యల ఆధారంగా రూపొందించిన ఈ హామీలు 2019 ఎన్నికల్లో వైసీపీకి చారిత్రాత్మక విజయాన్ని అందించాయి. మళ్లీ అదే సెంటిమెంట్‌తో 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జగన్ ఈ రెండో పాదయాత్రకు సిద్ధమయ్యారు. 2027లో యాత్ర ప్రారంభించి, ఎన్నికల వరకు దాదాపు రెండేళ్ల పాటు ప్రజల మధ్యే ఉండాలని ఆయన భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ యాత్ర ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జగన్ వ్యూహరచన చేస్తున్నారు.

## రేవంత్, మంత్రులు నకిలీలే!

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): వీఆర్ఏల కోసం తెచ్చిన జీవో 81, 85లు నకిలీవి అయితే.. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా నకిలీలే అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికల్లో 3797 మంది వీఆర్ఏలు పాలేరు నియోజకవర్గానికి వచ్చి ఎలా గెలుస్తవో చూస్తరు అని ఆయన పేర్కొన్నారు. జీవో నెం 81, 85 ప్రకారం 3797 మందికి ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేస్తూ, వీఆర్ఏ జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద జరిగిన ధర్నాలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. వీఆర్ఏ సమస్యలపై మాట్లాడకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకున్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వీఆర్ఏలకు న్యాయం చేస్తం. రెవెన్యూ మంత్రి పొంగులేటి నకిలీ మంత్రి. వీఆర్ఏల కోసం తెచ్చినే జీవో 81, 85.. నకిలీ జీవోలు అంటూ పొంగులేటి అవమానించారు అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. రెవెన్యూ సమస్యల గురించి మాట్లాడడానికి అసెంబ్లీ వెళ్తుంటే రేవంత్ రెడ్డి సర్కార్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకొని అసెంబ్లీకి రానివ్వలేదు. వీఆర్ఏలకు ఉద్యోగాలివ్వాలని అడుగుతరని భావించి, మహిళా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చీర లాగి, గొంతు నులిమి దాడి చేశారు అని మండిపడ్డారు.

## నీట్ ర్యాంకుల ఆధారంగా నర్సింగ్ ప్రవేశాలు

విజయవాడ, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో బీఎస్సీ (నర్సింగ్) కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులకు డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. 2026-27 విద్యా సంవత్సరానికి గాను నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. నీట్-యూజీ 2026 పరీక్షలో సాధించిన ర్యాంకుల ఆధారంగా ఈ ప్రవేశ ప్రక్రియను నిర్వహించనున్నట్లు వర్సిటీ స్పష్టం చేసింది. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సెప్టెంబర్ 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైంది. అభ్యర్థులు సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం 7 గంటల లోపు తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో ఉన్న 100% సీట్లతో పాటు, ప్రైవేట్ మైనారిటీ, నాన్-మైనారిటీ నర్సింగ్ కళాశాలల్లోని కేటగిరీ 'ఏ' కిందకు వచ్చే 60% సీట్లను భర్తీ చేయనున్నారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

## బీడీ స్కాలర్‌షిప్ గడువు పొడిగింపు

హైదరాబాద్, సెప్టెంబర్ (ఈవార్తలు): బీడీ కార్మికుల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న విద్యా ఉపకార వేతనాలకు దరఖాస్తు గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్లు బీడీ కార్మికుల సంక్షేమ సంస్థ అధికారులు తెలిపారు. అర్హత కలిగిన బీడీ కార్మికుల పిల్లలు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉపకార వేతనాల కోసం జాతీయ ఉపకార వేతనాల పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 30లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే సమయంలో అవసరమైన అన్ని పత్రాలను సమర్పించాలని, వివరాలను సరిగ్గా నమోదు చేయాలని సూచించారు. ఉపకార వేతనాలకు సంబంధించిన పూర్తి వివరాలను జాతీయ ఉపకార వేతనాల పోర్టల్‌లో తెలుసుకోవచ్చని తెలిపారు. సందేహాల నివృత్తికి 0120-6619540 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## ఏఐ చిత్రాలపై కఠిన చర్యలు

**మహేశ్ భగవత్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు**

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా, వివిధ డిజిటల్ వేదికల్లో మార్ఫింగ్ చేసిన తప్పుడు దృశ్యాలు, ఏఐ ద్వారా రూపొందించిన చిత్రాలు, దుష్ప్రచార కంటెంట్‌ను విస్తృతంగా ప్రచారం చేస్తున్న వారిపై తక్షణమే దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ చారి ఈ మేరకు తెలంగాణ లా అండ్ ఆర్డర్ డీజీపీకి మహేష్ మురళీధర్ భగవత్‌కు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులపై జరిగిన దాడి, దురుసు ప్రవర్తన ఘటనల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు కావాలనే ఫేక్ డిజిటల్ కంటెంట్‌ను సృష్టించి ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫేక్/ఏఐ జనరేటెడ్ చిత్రాలను నిజమైనవిగా చూపిస్తూ ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడంతో పాటు ఎన్నికైన ప్రజాప్రతినిధుల ప్రతిష్టకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని బీఆర్ఎస్ శాసనసభా పక్షం పేర్కొంది.

## ఈ20పై కేంద్రానికి మద్దతు: పొన్నం

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు. "ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు" అని ఆయన వివరించారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు.

## వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలివ్వాలి: జేఏసీ

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): జీవో నంబర్లు 81, 85 ప్రకారం 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించాలని వీఆర్ఏ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న 3,797 మంది వీఆర్ఏ వారసులకు వెంటనే నియామక ఉత్తర్వులు జారీ చేయాలని కోరింది. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 81, 85 ప్రకారం అర్హులైన వారసులకు ఉద్యోగాలు కల్పించాల్సి ఉన్నప్పటికీ సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదని జేఏసీ నాయకులు తెలిపారు. దీర్ఘకాలంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకోవాలని కోరారు. 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల వారసులకు ప్రాధాన్యత ఇచ్చి నియామకాలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్, ఉపాధ్యక్షుడు భరత్, చెన్నపురి హరీష్, మన్నె సాగర్, నర్సింహులు, యాదవ్, శ్రీకాంత్, బండారి మహేష్, సంగమేశ్వర్, వెంకటేష్, ఇమాంపాషా, కుమార్, ఆర్. కృష్ణయ్య, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో షాదీఖానా పనులు వేగవంతం

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): వేములవాడ పట్టణ ముస్లింల చిరకాల ఆకాంక్ష అయిన షాదీఖానా పునర్నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. బుధవారం భవనం రెండో అంతస్తు పైకప్పు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్, ముస్లిం కమిటీ ఇన్‌చార్జి అధ్యక్షుడు మహమ్మద్ అక్రమ్ ఆధ్వర్యంలో కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహమ్మద్ అక్రమ్ మాట్లాడుతూ ముస్లింల అవసరాలను గుర్తించి షాదీఖానా ఆధునికీకరణ, విస్తరణకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఆయన సహకారంతోనే పనులు వేగంగా సాగుతున్నాయని పేర్కొంటూ ముస్లిం సమాజం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్లు కొక్కుల రాజు, కొండ శేఖర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు పీర్ మొహమ్మద్, మసీదు కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ నవాబ్ ఖాన్, షేక్ ఇమామ్, సర్వర్ పాషా, మహమ్మద్ బషీర్, అబ్దుల్ రజాక్, బాబున్, షాహిద్ పాషా, సయ్యద్ ఉమర్, సయ్యద్ ఫహద్, అఫ్జల్ పాషా, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయాలి: సర్పంచులు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): ఉప సర్పంచ్‌లకు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేసి సర్పంచ్‌లకు పూర్తి అధికారాలు కల్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలువురు సర్పంచ్‌లు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అందె సుభాష్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధి, పరిపాలనలో సర్పంచ్‌లపై ఉన్న బాధ్యతలకు అనుగుణంగా వారికి అధికారాలు ఉండాలని కోరారు. ఉప సర్పంచ్‌లకు ఉన్న చెక్ పవర్ కారణంగా గ్రామపంచాయతీల పరిపాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. దీనిని రద్దు చేసి సర్పంచ్‌లకు పూర్తి బాధ్యతలు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాలోని పలువురు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



## గురుకులంలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

గంగాధర, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లిలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాళోజి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ బొజ్జ సురేష్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనం, మాధుర్యాన్ని వివరించారు. తల్లిని ప్రేమించినట్లే మాతృభాషను గౌరవించి, తెలుగు భాషను పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు రమేష్, సంపత్, సత్యనారాయణలను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఎస్ఐఆర్ : కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం కల్లెడ, తకళ్లపెల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ఫారాల్లో నమోదైన వివరాల సవరణలు, నోటీసుల జారీ, విచారణకు హాజరవుతున్న ఓటర్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల పేర్లు, ఇంటిపేర్లు, ఫొటోల్లో తప్పులు ఉంటే నిబంధనల ప్రకారం సరిచేయాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కల్లెడలో నిర్మిస్తున్న వివో భవనం, తకళ్లపెల్లిలో నిర్మిస్తున్న గ్రామపంచాయతీ, వివో భవనాలను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతతో వేగవంతం చేసి భవనాలను త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ షాదాబ్ హకీం, ఎంపీడీవో రమాదేవి, పంచాయతీరాజ్ అధికారులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.







## జగ్గని ఒర్రె పనుల్లో నాణ్యత ఏది?

మల్యాల, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల జగ్గని ఒర్రెకు 30 ఏళ్ల తర్వాత శాశ్వత పరిష్కారం లభిస్తుందన్న ఆశలు వ్యక్తమవుతున్న వేళ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు రూ. 2.46 కోట్లతో చేపడుతున్న సీసీ గైడ్‌వాల్ నిర్మాణ పనుల్లో నిబంధనలను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనుల్లో కాంక్రీట్ క్యూబ్ పరీక్షలు నిర్వహించడం లేదని, అవసరమైన విప్‌హోల్స్ ఏర్పాటు చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణం అనంతరం కాంక్రీట్‌కు సరైన క్యూరింగ్ కూడా చేయడం లేదని పేర్కొన్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం తగినంత నీటితో క్యూరింగ్ చేయాల్సి ఉన్నప్పటికీ ఆ విధంగా జరగడం లేదని తెలిపారు. ప్రజాధనంతో చేపడుతున్న పనుల్లో నాణ్యతా పరీక్షలు నిర్వహించకుండా పనులు కొనసాగించడం సరికాదని స్థానికులు అభిప్రాయపడ్డారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యతపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

## కేసీఆర్ దళితులకు క్షమాపణ చెప్పాలి: దుమాల

జగిత్యాల, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): దళితులు పాల్గొన్న ప్రదేశాన్ని పాలు, పసుపు నీటితో శుద్ధి చేయడం కుల వివక్షకు నిదర్శనమని ఎస్సీ డిపార్ట్‌మెంట్ జగిత్యాల జిల్లా చైర్మన్ దుమాల రాజ్‌కుమార్ ఆరోపించారు. టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళిత నాయకులు డప్పులతో నిరసన తెలిపిన అనంతరం బీఆర్‌ఎస్ నాయకులు ఆ ప్రాంతాన్ని పాలు, పసుపు నీటితో శుద్ధి చేశారని, ఇది ముమ్మాటికీ కుల వివక్షేనని రాజ్‌కుమార్ అన్నారు. ఘటనకు బాధ్యత వహిస్తూ కేసీఆర్ దళితులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాత మధు, నవీన్‌రెడ్డిలను సస్పెండ్ చేయడాన్ని హర్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొల్లారపు గిరిధర్‌తో పాటు మద్దెల నారాయణ, దాసరి సతీష్, భూమేష్, కంటే అంజయ్య, కోలేపాక మల్లేష్, కడమండ కమలాకర్, కొంగర పవన్, తడగొండ లక్ష్మణ్, మేక పవన్, గజ్జెల రాజు, నక్క అశోక్, దుమాల కిషోర్, సుద్దాల గంగాధర్, సంపత్‌కుమార్, కట్కూరి సురేష్, గిద్దె శంకర్, బాపూరావు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్‌ఫిలిం హబ్‌గా జగిత్యాల

**యూట్యూబర్ల ఐక్య అడుగులు**

**(శ్రీశైలం దూడం- ఫ్రీలాన్స్ జర్నలిస్టు- 9133947176)**

సినిమా తీయాలంటే హైదరాబాద్ వెళ్లాల్సిందేనన్న భావనకు జగిత్యాల యువత కొత్త నిర్వచనం చెబుతోంది. స్మార్ట్‌ఫోన్ కెమెరా నుంచి చిన్న డిజిటల్ కెమెరాలు, అత్యాధునిక పరికరాలు, ప్రొఫెషనల్ ఫిల్మ్ షూటింగ్ కెమెరాల వరకు అందిపుచ్చుకుని లఘుచిత్రాలు రూపొందిస్తున్నారు. స్థానిక కథలు, జీవన విధానం, చరిత్ర, ప్రకృతి, గ్రామీణ నేపథ్యాలను తెరపై ఆవిష్కరిస్తూ యూట్యూబ్, డిజిటల్ వేదికల్లో ప్రతిభ చాటుతున్నారు. ఇప్పటివరకు వ్యక్తిగతంగా సాగిన ఈ ప్రయాణానికి ఇప్పుడు ఐక్యత బలం తోడైంది. జగిత్యాలలోని ఏఆర్ ఫంక్షన్ హాల్‌లో సీనియర్ యూట్యూబ్ దర్శకుడు గడ్డం రాజారాం మోహన్‌రెడ్డి, కళాశ్రీ గుండేటి రాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి సుమారు 50 మంది షార్ట్‌ఫిలిం దర్శకులు, నటులు, రచయితలు, ఛాయాగ్రాహకులు, కూర్పుదారులు హాజరయ్యారు. 'జగిత్యాల షార్ట్‌ఫిలిం ఇండస్ట్రీ' పేరుతో ఐక్య వేదిక ఏర్పాటు చేయడం కొత్త అధ్యాయానికి నాంది పలికింది. జిల్లాలో ప్రతిభకు కొదవలేదు. కొరత ఉన్నది సాంకేతిక వసతులు, శిక్షణ, పరికరాల అందుబాటులోనే. కెమెరాలు, లైటింగ్, ధ్వని, ఎడిటింగ్, డబ్బింగ్ సదుపాయాలు జిల్లాలోనే ఉంటే చిన్న బడ్జెట్‌తోనూ నాణ్యమైన చిత్రాలు తీయవచ్చు. పరికరాల బ్యాంక్, అద్దె కేంద్రాలు, శిక్షణా శిబిరాలు, ఎడిటింగ్-డబ్బింగ్ కేంద్రాలు, నటీనటులు-సాంకేతిక నిపుణుల సమాచార భాండాగారం ఏర్పాటు చేస్తే రంగానికి సంస్థాగత బలం వస్తుంది. కొత్తవారికి కథ, దర్శకత్వం, నటన, కెమెరా, లైటింగ్, ధ్వని, కూర్పులో శిక్షణ అందితే మరింత ప్రతిభ వెలుగులోకి వస్తుంది. సారంగాపూర్ అటవీ ప్రాంతం, కోటిలింగాల, జగిత్యాల కోట, ధర్మపురి, కొండగట్టు, పొలాస వంటి లొకేషన్లు ఈ ప్రయత్నానికి మరో బలం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇప్పటికే షార్ట్‌ఫిలిం ఉత్పత్తి, ఉత్సవాలు, ప్రివ్యూ థియేటర్, మౌలిక వసతుల నమోదు, ఆన్‌లైన్ షూటింగ్ అనుమతుల వంటి వ్యవస్థలను కలిగి ఉన్నాయి. ఈ అవకాశాలను జగిత్యాల కళాకారులకు చేరువ చేయడంతో పాటు ప్రత్యేక షార్ట్‌ఫిలిం హబ్ కోసం ప్రభుత్వం విధానపరమైన ప్రోత్సాహం ఇవ్వాలి. జగిత్యాల ఫిలిం సొసైటీ స్థానిక కళాకారులకు వారధిగా నిలిచి శిక్షణ, మార్గదర్శకత్వం, చిత్రోత్సవాలు, రాష్ట్రస్థాయి అవకాశాలకు



అనుసంధానం చేయాలి. ఇందుకోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక సమన్వయ వ్యవస్థ ఏర్పాటు చేయడం అవసరం. షూటింగ్ అనుమతులు, లొకేషన్ల వివరాలు, పరికరాల లభ్యత, శిక్షణా కార్యక్రమాలు, కళాకారుల వివరాలను ఒకే వేదికపై అందిస్తే కొత్తవారికి మార్గం సులభమవుతుంది. విద్యాసంస్థలు, యువజన సంఘాలు, సాంస్కృతిక సంస్థలను అనుసంధానించి కథారచన నుంచి పోస్టు ప్రొడక్షన్ వరకు వర్క్‌షాపులు నిర్వహించాలి. ఉత్తమ లఘుచిత్రాలకు జిల్లా స్థాయిలో పురస్కారాలు అందించి, ఎంపికైన చిత్రాలను రాష్ట్ర, జాతీయ చిత్రోత్సవాలకు పంపే విధానం రూపొందించాలి. స్థానిక ప్రతిభను వెలికితీసి, నిర్మాణ ఖర్చులు తగ్గించి, కొత్త కథలకు అవకాశాలు కల్పించడమే ఈ ఐక్యత అసలు లక్ష్యం కావాలి. అప్పుడే జగిత్యాల పేరు తెరపై కొత్త వెలుగుగా నిలుస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా సగర్వంగా మార్మోగాలి. 'జగిత్యాల షార్ట్‌ఫిలిం ఇండస్ట్రీ' ఒక సమావేశంతో ఆగకుండా కార్యాచరణగా మారాలి. ప్రభుత్వం చేయూత, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సాంకేతిక సహకారం, ఫిలిం సొసైటీ చొరవ, కళాకారుల ఐక్యత కలిస్తే జిల్లాలో కొత్త సృజనాత్మక వాతావరణం ఏర్పడుతుంది. స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంది.. కథలు ఉన్నాయి.. లొకేషన్లు ఉన్నాయి. ఇప్పుడు అవసరమైంది సరైన వేదిక.

## పేదల సొంతింటి కలను నెరవేరుస్తాం: పుల్కం రాజు

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. వేములవాడ పట్టణంలోని 3, 4, 15, 18, 27 వార్డుల్లో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు బుధవారం భూమిపూజ నిర్వహించారు. చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా హాజరై నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత స్థలం ఉన్నప్పటికీ ఇల్లు నిర్మించుకోలేని పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు విడతల వారీగా నిధులు నేరుగా ఖాతాల్లో జమ



చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక కృషితో పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నూతనంగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇంటి నిర్మాణాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షిస్తారని తెలిపారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు గుడిసె సంతోష కరుణాకర్, కొండ రాజశేఖర్, తోట రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంఘ స్వామి యాదవ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మున్సిపల్ అధికారులు, లబ్ధిదారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## సమతుల్య పోషకాహారంతో ఆరోగ్య సమాజం

సిరిసిల్ల అగ్రహారం, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సమతుల్య పోషకాహారం కీలకమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. శంకర్ అన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం సౌజన్యంతో సిరిసిల్ల అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'తెలంగాణ రైజింగ్-2047'లో భాగంగా 'ఆరోగ్యకర సమాజం కోసం సమతుల్య పోషకాహారం' అంశంపై బుధవారం ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. శంకర్ అధ్యక్షత వహించారు. శాతవాహన విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు డా. పి. జోసెఫ్ రాజు, ఎం. సాయి ప్రియ ముఖ్య వక్తలుగా పాల్గొని సమతుల్య పోషకాహారం ప్రాధాన్యత, పోషక పదార్థాల అవసరం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పోషకాహార లోపాల నివారణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత సమతుల్య ఆహారపు అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని ఆ సందేశాన్ని కుటుంబ సభ్యులు, సమాజానికి చేరవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని కన్వీనర్ డా. ఎస్. కృష్ణ ప్రసాద్, కో-కన్వీనర్ కుమారి ఎస్. శివాని, నిర్వహణ కార్యదర్శి డా. కె.వై. కరుణ సమన్వయం చేశారు. అకడమిక్ కోఆర్డినేటర్ డా. ఎ. ప్రసాద్, సిబ్బంది సంఘం కార్యదర్శి, శారీరక విద్యా సంచాలకుడు జి. శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కాళోజీ ఆశయాలు స్ఫూర్తిదాయకం: గరిమ

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): ప్రజాకవి కాళోజీ నారాయణరావు రచనలు, కవిత్వం ద్వారా సామాజిక పరిస్థితులను ప్రతిబింబిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ భాష, యాస, సంస్కృతిపై కాళోజీకి ఉన్న అభిమానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఓ శ్రీనివాసచారి, ఏడీ మైన్స్ క్రాంతికుమార్, డీవైఎస్ఓ రాందాస్, పరిశ్రమల శాఖ జీఎం హన్మంతు, జిల్లా వైద్యాధికారి ఏంజెలా అల్ఫ్రెడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, కలెక్టరేట్ పర్యవేక్షకులు ఉమారాణి, వైశాలి తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే శంకరయ్య, సీఎంపై కేసు నమోదు చేయాలి

జగిత్యాల, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): కేసీఆర్ చావును కోరుతూ డప్పు కొట్టిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్యతో పాటు, నేరాన్ని ప్రోత్సహించారంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత సురేష్, మాజీ మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాధకుడు కేసీఆర్‌కు భౌతికంగా కీడు జరగాలని కోరుకోవడం నేరపూరిత చర్య అన్నారు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉన్నా.. చావు డప్పు కొడతామంటూ వ్యాఖ్యలు చేయడం క్షమించరానిదని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అసెంబ్లీలో బీఆర్‌ఎస్ సభ్యులను ఎదుర్కొనలేకే సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ సాధన, కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ సరఫరా తదితర అంశాల్లో కేసీఆర్ పాలనను ప్రస్తావించారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దావా వసంత మాట్లాడుతూ కేసీఆర్ చావు డప్పు కొడతామన్న ఎమ్మెల్యే శంకరయ్య వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. ఎమ్మెల్యే శంకరయ్యను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచ పటంలో తెలంగాణకు గుర్తింపు తీసుకొచ్చిన కేసీఆర్‌పై ఈగ వాలినా సహించేది లేదని అన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని పేర్కొన్నారు.

## వృద్ధురాలి ఇంట్లో చోరీ.. ముగ్గురి అరెస్టు

రాయికల్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్‌లో వృద్ధురాలి ఇంట్లో చొరబడి బంగారు గొలుసు దొంగిలించిన కేసులో ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి బంగారు గొలుసు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జగిత్యాల డీఎస్పీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 5న రాయికల్‌కు చెందిన కల్లెడ నర్సు (71) ఇంట్లో నిద్రిస్తుండగా పల్లికొండ నరేష్ (25), తోపారపు నవనీత్ (19), కల్లెడ మనోజ్ (19) ఆమె మెడలోని సుమారు ఒకటిన్నర తులాల బంగారు గొలుసును దొంగిలించినట్లు తెలిపారు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై సుధీర్‌రావు, సిబ్బంది శ్రీనివాస్, విజయ్, తిరుమల్‌లు సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను పట్టుకున్నట్లు డీఎస్పీ వివరించారు.

## బీఆర్‌ఎస్ గొంతు నొక్కేందుకే సస్పెన్షన్: సుంకె రవిశంకర్

గంగాధర, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల గొంతు నొక్కే కుట్రలో భాగంగానే అసెంబ్లీలో సస్పెన్షన్లు విధించారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్‌పై ఆయన స్పందించారు. మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన దాడిని ప్రశ్నిస్తే, న్యాయం కోరితే, ప్రజా సమస్యలపై మాట్లాడితే సస్పెండ్ చేస్తారా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ వెయ్యి రోజుల వైఫల్య పాలనపై చర్చించాలని, ఆడబిడ్డలకు న్యాయం చేయాలని, 22ఏ అంశంపై చర్చించాలని కోరినందుకే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు వేశారని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను తెలంగాణ సమాజం గమనిస్తోందని, సరైన సమయంలో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని రవిశంకర్ అన్నారు.

# రెట్రో ట్రెండ్.. 80ల్లోకి మళ్లిన జనం!







## ఏఐ ఫొటోలతో హల్చల్

### 1980ల్లో నేను ఎలా ఉండేవాడిని? చెక్ చేసుకుంటున్న నెటిజన్లు

సాంకేతికత మనల్ని భవిష్యత్తులోకి తీసుకెళ్తుంటే.. ఇప్పుడు అదే సాంకేతికతతో జనం గతంలోకి ప్రయాణిస్తున్నారు. కృత్రిమ మేధస్సు ఆధారిత ఫొటోల కొత్త ట్రెండ్ సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తోంది. ముఖ్యంగా 1980ల నాటి రూపం, దుస్తులు, కేశాలంకరణ, ఫొటోగ్రఫీ శైలి, సినిమాటిక్ నేపథ్యంతో తమను తాము ఊహించుకుంటూ నెటిజన్లు ఏఐ ఫొటోలు తయారు చేసుకుంటున్నారు.

ఇదే ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చాలామంది నెటిజన్లను వెంటాడుతున్న ఆసక్తికర ప్రశ్న. తమ ప్రస్తుత ఫొటోను ఏఐ సాధనాలకు అందించి.. "1980లలో తీసిన ఫొటోలా మార్చండి" అని సూచన ఇస్తే చాలు. క్షణాల్లోనే రూపం మారిపోతోంది. నేటి దుస్తుల స్థానంలో అప్పటి ఫ్యాషన్.. ఆధునిక నేపథ్యం స్థానంలో పాతకాలపు స్టూడియో వాతావరణం.. డిజిటల్ స్పష్టత స్థానంలో పాత ఫిల్మ్ ఛాయలు కనిపిస్తున్నాయి. పురుషులకు పెద్ద కాలర్ చొక్కాలు, ఎత్తుగా కనిపించే నడుము దుస్తులు, దట్టమైన మీసాలు, అప్పటి జుట్టు అలంకరణ.. మహిళలకు రంగురంగుల చీరలు, పెద్ద చెవి దిద్దులు, ప్రత్యేకమైన కేశాలంకరణ వంటి అంశాలను ఏఐ జోడిస్తోంది. వెచ్చని వెలుతురు, మృదువైన ఛాయలు, పాత ఫిల్మ్ ధాన్యపు ప్రభావం ఫొటోలకు మరింత పాతకాలపు రూపాన్ని ఇస్తున్నాయి.

**సినిమా పోస్టర్ల నుంచి కుటుంబ ఆల్బమ్ల వరకు**

ఈ ధోరణి కేవలం వ్యక్తిగత ఫొటోలకే పరిమితం కావడం లేదు. కొందరు తమను 1980ల సినిమా కథానాయకులు, కథానాయికల తరహాలో ఊహించుకుంటుంటే.. మరికొందరు పాత కుటుంబ ఆల్బమ్లోని ఫొటోల మాదిరిగా చిత్రాలను తయారు చేసుకుంటున్నారు. ఇంకొందరు అప్పటి స్టూడియో ఫొటో, పాత పత్రిక ముఖచిత్రం, సినిమా సన్నివేశం తరహాలో తమ రూపాన్ని మార్చుకుంటున్నారు. ఈ ట్రెండ్ సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు విస్తరించింది. పలువురు సినీ ప్రముఖులు, సామాజిక మాధ్యమ ప్రభావశీలులు మాత్రమే కాకుండా రాజకీయ నాయకులు సైతం 1980ల శైలిలో రూపొందించిన ఏఐ ఫొటోలను పంచుకోవడంతో దీనిపై ఆసక్తి మరింత పెరిగింది.

**ఏఐతో సరదా.. కానీ జాగ్రత్త కూడా**

అయితే ఈ సరదా వెనుక కొన్ని జాగ్రత్తలు కూడా అవసరమే. ఏఐకి వ్యక్తిగత ఫొటోలను అందించే సమయంలో గోప్యత, చిత్రాల వినియోగం వంటి అంశాలను వినియోగదారులు గుర్తుంచుకోవాలి. అలాగే ఏఐ రూపొందించిన ఫొటోను నిజమైన పాత ఫొటోగా చూపించడం వల్ల అపోహలు ఏర్పడే అవకాశం ఉంది. ఏఐ రూపొందించినదని స్పష్టంగా పేర్కొనడం మంచిది. ఏఐ చిత్రాల్లో ముఖం, చేతులు, ఆభరణాలు, నేపథ్యంలోని అక్షరాలు వంటి అంశాల్లో పొరపాట్లు కూడా కనిపించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. భవిష్యత్తును నిర్మించేందుకు పుట్టిన కృత్రిమ మేధస్సు ఇప్పుడు మనల్ని గతంలోకి తీసుకెళ్తోంది. ఫొటో ఒక్కటే.. రూపం మాత్రం మరో కాలానికి చెందినది. నిన్నటి జ్ఞాపకాలను నేటి సాంకేతికతతో కలిపిన ఈ 'రెట్రో' ప్రయోగం.. సామాజిక మాధ్యమాల్లో 80ల కాలాన్ని మళ్లీ జీవింపజేస్తోంది.

**పాత జ్ఞాపకాలకు కొత్త రూపం**

1980ల కాలాన్ని ప్రత్యక్షంగా చూడని యువత కూడా ఈ ధోరణికి ఆకర్షితులవుతున్నారు. తల్లిదండ్రులు, తాతముత్తాతల పాత ఫొటోల్లో కనిపించే దుస్తులు, జుట్టు, ఫొటో నేపథ్యాలను ఇప్పుడు తమకు అన్వయించుకుని చూసుకుంటున్నారు. మరోవైపు ఆ కాలాన్ని చూసిన తరానికి ఈ ఫొటోలు పాత జ్ఞాపకాలను మళ్లీ గుర్తుచేస్తున్నాయి. అందుకే ఇది కేవలం ఫొటో మార్పిడి ధోరణిగా కాకుండా తరాల మధ్య జ్ఞాపకాలను కలిపే డిజిటల్ ప్రయోగంగా మారుతోంది.

# మారిటల్ రేప్ నిర్ణయం పార్లమెంట్‌దే

## సుప్రీంకోర్టుది కాదు: కేంద్రం

న్యూఢిల్లీ: వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించడం లేదా చట్టాల్లో మార్పులు చేయడం సుప్రీం కోర్టు పరిధిలోని అంశం కాదని, అది పార్లమెంట్, కార్యనిర్వాహక వ్యవస్థ పరిధిలోకి వచ్చే నిర్ణయమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం అత్యున్నత న్యాయస్థానానికి కేంద్రం తెలిపింది. వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై మూడు వారాల తర్వాత విచారణ ప్రారంభిస్తామని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యవహారాన్ని ప్రతి బుధ, గురువారాల్లో తుది విచారణకు స్వీకరించనున్నట్లు పేర్కొంది. గతంలో వైవాహిక అత్యాచారంపై ఢిల్లీ హైకోర్టుఎటూతేల్చని సంగతి తెలిసిందే. కేంద్రం తరఫున హాజరైన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. వైవాహిక అత్యాచారాన్ని నేరంగా ప్రకటించే బాధ్యత పార్లమెంటుదే తప్ప, సుప్రీం కోర్టుది కాదని స్పష్టం చేశారు.

ఐపీసీలోని సెక్షన్ 375లో ఉన్న వైవాహిక అత్యాచార మినహాయింపును కొత్తగా తెచ్చిన భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 63 (ఎక్సెప్షన్ 2)లో కూడా కొనసాగించడాన్ని పిటిషనర్లు సవాల్ చేశారు. ఈ చట్ట నిబంధన ప్రకారం.. భార్య వయస్సు 18 ఏళ్లు నిండితే భర్త బలవంతంగా ఆమెపై లైంగిక లైంగిక చర్యకు పాల్పడితే 'అత్యాచారం'గా పరిగణించరు. మహిళల భద్రత, శారీరక రక్షణ అనేది అత్యంత కీలకమైన అంశమని పేర్కొంటూ.. దీన్ని ప్రభుత్వం 'అత్యాచారం'గా నిర్వచిస్తుందో లేదో



అని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి ప్రశ్నించారు. "వివాహంలో ఇష్టం లేకపోయినా బలవంతంగా లైంగిక దాడికి గురైన మహిళ ఖచ్చితంగా బాధితురాలే.. మేము బాధితులను రక్షిస్తాం... అయితే ప్రభుత్వం దీనిని అత్యాచారంగా నిర్వచిస్తుందా లేదా అనేదే ప్రశ్న" అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, పెళ్లి అనేది మహిళల స్వేచ్ఛకు ముగింపు కాకూడదు' అని జస్టిస్ బాగ్చి వ్యాఖ్యానించారు. వైవాహిక అత్యాచార మినహాయింపు అమలులో ఉన్నప్పటికీ శిక్షించవచ్చా? అసలు మినహాయింపు నిబంధన రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటు అవుతుందా? లేదా? అనే ఈ రెండు అంశాలను పరిశీలిస్తామని కోర్టు పేర్కొన్నారు. పిటిషనర్ల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కరుణ నంది వాదనలు వినిపిస్తూ.. తన భార్యపై భర్త లైంగిక క్రూరత్వాన్ని కేవలం వైవాహిక బంధాన్ని సాకుగా చూపి చట్టపరమైన మినహాయింపును కోరలేరని అన్నారు. వైవాహిక బంధం అనేది భార్య ఇష్టానికి విరుద్ధంగా లైంగిక చర్యలకు పాల్పడటానికి లేదా ఆమెకు తీవ్ర శారీరక హాని తలపెట్టడానికి లైసెన్స్ ఇవ్వదని స్పష్టం చేశారు.

# క్రీడాచట్టం పరిధిలోకి బీసీసీఐ?

**సుప్రీంకోర్టు సూటి ప్రశ్నలు**

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సహా అన్ని రాష్ట్ర క్రికెట్ సంఘాలను నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ యాక్ట్-2025 పరిధిలోకి ఎందుకు తీసుకురాకూడదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అదేవిధంగా ఆయా సంస్థల పదవుల్లో ఉన్న ఆఫీస్ బేరర్ల సేవా నిబంధనలను ప్రస్తుతం అమల్లో ఉన్న ఈ చట్టం కిందకు ఎందుకు చేర్చకూడదని నిలదీసింది. ఇందుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సమర్పించాలని బీసీసీఐ, రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్లను న్యాయస్థానం ఆదేశించింది. బీసీసీఐ వ్యవహారానికి సంబంధించి 2014 నుంచి పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కీలక ప్రశ్నలు సంధించింది. భారతీయ క్రీడా రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం, క్రీడాకారుల సంక్షేమాన్ని పెంపొందించడం కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ యాక్ట్-2025ను తీసుకొచ్చింది. అయితే, ప్రస్తుత నిబంధనల ప్రకారం బీసీసీఐ ఈ చట్టం పరిధిలోకి రాదు. ప్రస్తుతం బీసీసీఐ వ్యవహారాలు, వివాదాలకు సంబంధించి సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఒకవేళ బీసీసీఐ కూడా ఈ చట్టం పరిధిలోకి వస్తే.. వీటికి సంబంధించిన అన్ని వివాదాలు, పెండింగ్ కేసులు సుప్రీంకోర్టు నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ ట్రిబ్యునల్‌కి బదిలీ అవుతాయి. దీనివల్ల సుప్రీంకోర్టుపై ఉన్న కేసుల భారం తగ్గుతుంది.

# 'సెక్యులర్ ఫ్రంట్'గా టీవీకే కూటమి

చెన్నై: ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ( టీవీకే ) కూటమికి అధికారిక పేరు ఖరారయ్యింది. టీవీకే అధ్యక్షుడు, సీఎం విజయ్ బుధవారం చెన్నైలోని టీవీకే ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్, వీసీకే, ఎండీఎంకే, ఐయుఎంఎల్ పార్టీల నేతలతో రెండోసారి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తమ కూటమికి 'లౌకిక సామాజిక న్యాయ విజయ కూటమి'అని నామకరణం చేశారు. చెన్నైలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కీలక సమావేశంలో కాంగ్రెస్, విడుదలై చిరుతైగల్ కట్చి, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, మరుమలర్చి ద్రావిడ మున్నేట్ర కజగం పార్టీల అగ్రనేతలు పాల్గొంటారని పీటీఐ వార్తా సంస్థ ముందే ధ్రువీకరించింది. అయితే, సీపీఎం, సీపీఐ పార్టీలు ఈ భేటీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాయి. జులై 1 తర్వాత అధికారిక కూటమి చర్చలను లెఫ్ట్ పార్టీలు బహిష్కరించడం ఇది వరుసగా రెండోసారి. ఈ నిర్ణయంపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం మంగళవారం స్పందిస్తూ.. అసెంబ్లీలో స్థిరత్వాన్ని కాపాడటమే లక్ష్యంగా వెలుపలి నుంచి కేవలం అంశాల వారీగా మద్దతు మాత్రమే కొనసాగుతుందని స్పష్టం చేశారు. మరోవైపు జాతీయ నాయకత్వం అంశంపై టీవీకే, కాంగ్రెస్ పార్టీల మధ్య బహిరంగ విభేదాలు మరింత వేడి రాజేస్తున్నాయి. 2029 సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా ప్రతిపాదిస్తూ టీవీకే ఎమ్మెల్యేలు, మంత్రులు చేసిన వ్యాఖ్యలపై తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష కూటమికి రాహుల్ గాంధీ మాత్రమే తిరుగులేని నాయకుడని కాంగ్రెస్ మంత్రి ఎస్. రాజేష్ కుమార్ ఉద్ఘాటించారు. ఈ ఒప్పందానికి భంగం కలిగించేలా వ్యవహరిస్తే మంత్రివర్గంలో భాగస్వామ్యంపై పార్టీ పునరాలోచించాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ఆ కలెక్టర్‌కు ఎంత ధైర్యం?

## కేసు కొట్టేసినా విద్యార్థినికి నోటీసులా?.. సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

న్యూఢిల్లీ: నీట్ యూజీ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలో చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థికి గ్రేటర్ నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీ చేయడంపై బుధవారం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సీజేపీ నిరసనలకు సంబంధించి విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్లన్నింటినీ సుప్రీంకోర్టు కొట్టివేయడమే కాకుండా, విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని స్పష్టంగా ఆదేశాలిచ్చినప్పటికీ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎలా నోటీసులు జారీ చేస్తారని కోర్టు ప్రశ్నించింది. "మేజిస్ట్రేట్ ఆ నోటీసు ఎలా జారీ చేస్తారు? దేశవ్యాప్తంగా ఏ విద్యార్థిపై కూడా ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. మేజిస్ట్రేట్ అంత సాహసం ఎలా చేయగలరు?" అని ఆగ్రహించిన కోర్టు వ్యాఖ్యానించింది. సీజేపీ నిరసనల సందర్భంగా విద్యార్థులపై నమోదు చేసిన అన్ని కేసులను రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ద్వారా తన అసాధారణ అధికారాలను ఉపయోగించుకున్న సుప్రీంకోర్టు సెప్టెంబరు 1న రద్దు చేస్తూ తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఆ నిరసనలకు సంబంధించి వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో జులై 20 నుంచి 25 మధ్య నమోదైన ఎఫ్ఐఆర్‌లను విచారించకూడదని, వాటిని రద్దుచేస్తున్నట్టు పరిగణించాలని కోర్టు ఆదేశించింది. నిరసనలకు సంబంధించి ఏ విద్యార్థిపై కూడా కొత్తగా ఎలాంటి చర్యలు తీసుకోకూడదని కూడా కోర్టు స్పష్టం చేసింది. తాజాగా, నోయిడా విద్యార్థి ఉదంతాన్ని సీనియర్ అడ్వకేట్ బిశ్వజిత్ భట్టాచార్య కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. సెప్టెంబర్ 4న ఆ విద్యార్థికి జారీ చేసిన నోటీసుకు సంబంధించి గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ల నుంచి వివరణ కోరతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ తెలిపారు. గౌతమ్ బుద్ధ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి అక్షత్ త్రిపాఠికి సెప్టెంబర్ 4న జారీ చేసిన నోటీసును మర్నాడే ఉపసంహరించుకున్నట్లు కోర్టుకు తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం చేస్తున్నాడని, జంతర్ మంతర్ వద్ద జరిగిన సీజేపీ నిరసనలో పాల్గొనడానికి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాడని త్రిపాఠిపై ఆరోపణలు చేశారు. ఈ ఘటనను 'భారతీయ విద్యార్థులతో ప్రయోగం'గా అభివర్ణించిన అడ్వకేట్ భట్టాచార్య, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జోక్యం చేసుకోవాలని కోర్టును అభ్యర్థించారు. భట్టాచార్య వాదనతో ఏకీభవించిన జస్టిస్ సూర్యకాంత్.. మేజిస్ట్రేట్ వ్యవహరించిన తీరుపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "నిరసనల్లో పాల్గొన్న మా యువతపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని మా సెప్టెంబర్ 1 ఆదేశాలు స్పష్టంగా ఉన్నప్పుడు, ఒక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ లేదా జిల్లా మేజిస్ట్రేట్ ఎలా నోటీసు జారీ చేయడం మాకు ఆశ్చర్యంగా ఉంది" అని సీజేఐ పేర్కొన్నారు.

# 100 డాలర్లు దాటిన చమురు బ్యారెల్

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఇరాన్, యూఎస్‌ల మధ్య పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. ప్రపంచ ప్రామాణికమైన బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును దాటగా, భారత క్రూడ్ బాస్కెట్ ధర దాదాపు 109 డాలర్లకు చేరుకుంది. అయినప్పటికీ, దేశీయంగా సామాన్యులపై భారం పడకుండా ప్రభుత్వం ఇంధన రిటైల్ ధరల్లో మార్పులు చేయకపోవడంతో భారత చమురు కంపెనీలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ఇక్రా నివేదిక ప్రకారం, ప్రస్తుతం మన చమురు సంస్థలు లీటరు పెట్రోల్‌పై రూ. 5, డీజిల్‌పై రూ. 23 చొప్పున మార్కెటింగ్ నష్టాలను భరిస్తున్నాయి. గత మూడు నెలలుగా ధరల సవరణ జరగకపోవడమే కాకుండా, సరఫరా అవాంతరాల భయాల మధ్య ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో రిటైల్ సంస్థల లాభదాయకత ప్రశ్నార్థకంగా మారింది. కాగా, దేశీయ అవసరాల కోసం 88 శాతానికి పైగా ముడి చమురును దిగుమతులపైనే ఆధారపడే భారత్‌కు ఈ ధరల పెంపు పెద్ద సవాలుగా మారింది.



# అమెరికా 'చేప' ఇరాన్‌కు చిక్కింది!

## హర్మూజ్‌లో భారీ షాక్.. ఐఆర్జీసీకి బందీగా 'డైవ్ ఎల్డీ'

టెహ్రాన్: హర్మూజ్ జల సంధిలో అమెరికాకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. జల సంధి ప్రవేశ మార్గం వద్ద అమెరికా సైన్యానికి చెందిన అత్యాధునిక మానవరహిత జలాంతర్గామి ఇరాన్‌కు చిక్కింది. ఈ మేరకు ఇరానీ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌కు చెందిన అధికారిక వార్తా సంస్థ సెఫా న్యూస్ ప్రకటన చేసింది. అత్యంత సంక్లిష్టమైన నిఘా సమాచారం ఆధారంగా సబ్‌మెరైన్‌ను చేజిక్కించుకున్నట్లు ఐఆర్జీసీ పేర్కొంది. దీనిని ప్రపంచంలోనే అత్యాధునిక సబ్‌సర్ఫేస్ వెహికల్ టెక్నాలజీ కలిగిన 'డైవ్- ఎల్డీ'గా ఇరాన్ వెల్లడించింది. దీనికి సంబంధించిన దృశ్యాలను విడుదల చేసింది. హర్మూజ్ జలసంధిపై ఎగురుతున్న అమెరికాకు చెందిన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను కూడా తమ వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చివేసాయని ఐఆర్జీసీ తెలిపింది. ఇరాన్ ప్రకటన అనంతరం ఓ ప్రకటన విడుదల చేసిన అమెరికా సైన్యం.. ప్రాంతీయ జలాల్లో సర్వే నిర్వహిస్తుండగా తమకు చెందిన ఒక అండర్‌వాటర్ డ్రోన్ సాంకేతిక లోపానికి గురైందని చెప్పింది. అయితే ఇరాన్ స్వాధీనం చేసుకున్న పరికరం ఇదేనా? కాదా అనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. 'పశ్చిమాసియా జలాల్లో కొనసాగుతున్న కార్యకలాపాలకు మద్దతుగా ఇది సర్వే చేస్తోంది.. సాంకేతిక లోపం తలెత్తిన ఆ డ్రోన్ పాత మోడల్. అందులో ఎలాంటి సున్నితమైన సమాచారం కానీ, అత్యంత రహస్యమైన సోనార్ లేదా రాడార్ పరికరాలు కానీ లేవు" అని పెంటగాన్ ప్రతినిధి తెలిపారు. తక్కువ ఖర్చుతో సముద్ర ప్రాంతాలను పర్యవేక్షించడం, సమాచారాన్ని సేకరించడం, నావికుల ప్రాణాలకు ముప్పు లేకుండా శత్రు నౌకలు, జలాంతర్గాములను ట్రాక్ చేయడం కోసం అమెరికా సైన్యం అన్‌మ్యాన్డ్ నావికా వ్యవస్థల్లో భారీగా పెట్టుబడులు పెడుతోంది.

# ఐఫోన్ ఫోల్డ్.. రూ. 3 లక్షలు

న్యూఢిల్లీ: గ్లోబల్ టెక్ దిగ్గజం యాపిల్ తన ఫ్లాగ్‌షిప్ 'సర్ ప్రైజ్ అండ్ షైన్' ఈవెంట్‌లో సరికొత్త ఐఫోన్ 18 ప్రో, 18 ప్రో మ్యాక్స్ మోడళ్లతో పాటు తన మొట్టమొదటి ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ 'ఐఫోన్ డ్యూయో'ను అధికారికంగా ఆవిష్కరించింది. గెలాక్సీ జీ ఫోల్డ్ 8 తరహాలోనే మూసి ఉన్నప్పుడు సాధారణ ఫోన్‌లా, తెరిచినప్పుడు ఐప్యాడ్ లాంటి పెద్ద డిస్‌ప్లేతో కనిపించే ఈ డివైజ్, ఐఫోన్ చరిత్రలోనే తొలిసారిగా ఒకేసారి రెండు యాప్‌లను పక్కపక్కనే వాడే మల్టీటాస్కింగ్ సదుపాయంతో వచ్చింది. ప్రత్యేకమైన 'నానో-టెక్చర్డ్ ఫినిషింగ్' వల్ల స్క్రీన్‌పై క్రీజ్ కనిపించదని యాపిల్ స్పష్టం చేసింది. 2ఎన్ఎం ఏ20 ప్రో చిప్‌సెట్, 256జీబీ బేస్ స్టోరేజ్, టచ్ఐడీ, రోజంతా పనిచేసే బ్యాటరీ, 20 నిమిషాల్లో 50 శాతం ఛార్జింగ్ సపోర్ట్‌తో ఈ ఫోన్ మార్కెట్లోకి వచ్చింది. ఏరోస్పేస్-గ్రేడ్ అల్యూమినియం బాడీతో స్టార్ వైట్, నైట్ స్కై రంగుల్లో లభించే ఈ ఫోన్ ప్రారంభ ధరను రూ. 2,99,900గా నిర్ణయించారు. ఈ ఫోన్ కోసం అక్టోబర్ 16 నుండి ప్రీ-ఆర్డర్లు ప్రారంభమవుతాయని, అక్టోబర్ 23 నుండి అమ్మకాలు మొదలవుతాయని పేర్కొంది. ఇక, గతేడాది వచ్చిన ఐఫోన్ 17 ప్రోతో పోలిస్తే, నయా 18 సిరీస్ అద్భుతమైన హార్డ్‌వేర్ అప్‌గ్రేడ్‌లతో రూపొందింది. అత్యంత శక్తివంతమైన 2ఎన్ఎం-జనరేషన్ 'ఏ20 ప్రో' ప్రాసెసర్‌తో పాటు, యాపిల్ స్వయంగా తయారు చేసిన 'సీ2' మోడమ్‌ను వీటిలో పొందుపరిచారు. ఐఓఎస్27 ఆపరేటింగ్ సిస్టమ్‌పై పనిచేసే ఈ ఫోన్‌లలో ప్రో మోడల్ 6.3-అంగుళాలు, ప్రో మ్యాక్స్ 6.9-అంగుళాల డిస్‌ప్లేతో వస్తున్నాయి. ధరలకు సంబంధించి ఐఫోన్ 18 ప్రో రూ. 1,64,900కి లభిస్తుండగా, ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ రూ. 1,79,900 ప్రారంభ ధరకు అందుబాటులో ఉంది. ఇదే ఈవెంట్‌లో యాపిల్ తన యాపిల్ వాచ్ సిరీస్ 12ను రూ. 56,900కు, వాచ్ అల్ట్రా 4ను రూ. 1,09,900కు, ఎయిర్‌పాడ్స్ 5ను రూ. 14,900కు విడుదల చేసింది.

## లవ్లీ చిత్రం





## 18 నుంచి ఇరుముడి ఓటీటీ స్ట్రీమింగ్!

ఓటీటీ ప్రేక్షకులకు అదిరిపోయే గుడ్‌న్యూస్. థియేటర్లలో సంచలన విజయాన్ని అందుకున్న మాస్ మహారాజా రవితేజ 'ఇరుముడి' ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఎమోషనల్ డ్రామా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో సత్తా చాటింది. ముఖ్యంగా రవితేజను మాస్ హీరోగా మాత్రమే కాకుండా ఒక బలమైన ఎమోషనల్ నటుడిగా చూపించిన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంది. ఇప్పుడు థియేట్రికల్ రన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ మూవీ.. ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. 'నిన్ను కోరి', 'మజిలీ' వంటి ఎమోషనల్ కథలను తెరకెక్కించిన దర్శకుడు శివ నిర్వాణ.. రవితేజతో 'ఇరుముడి'ని తెరకెక్కించారు. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమాకు పాజిటివ్ పబ్లిక్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద వసూళ్లు స్థిరంగా కొనసాగాయి. ఇతర సినిమాల నుంచి పోటీ ఉన్నప్పటికీ.. 'ఇరుముడి' మాత్రం సుదీర్ఘంగా థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 200 కోట్ల గ్రాస్ మార్క్‌ను అందుకున్నట్లు సమాచారం. రవితేజ కెరీర్‌లో ఈ సినిమా మరో భారీ విజయంగా నిలిచింది. రవితేజ అంటే మాస్, కామెడీ, ఎనర్జిటిక్ యాక్షన్ అనే ఇమేజ్ ప్రేక్షకుల్లో బలంగా ఉంది. అయితే 'ఇరుముడి'లో శివ నిర్వాణ ఆయనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. కుటుంబ బంధాలు, తండ్రీకూతుళ్ల మధ్య అనుబంధం, భావోద్వేగాల చుట్టూ కథను నడిపించిన తీరు ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేసిందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ముఖ్యంగా రవితేజ నటనలోని ఎమోషనల్ షేడ్స్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్‌పై ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ 'ఇరుముడి' డిజిటల్ హక్కులను దక్కించుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. సెప్టెంబర్ 18 నుంచి ఈ సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ ఒకేసారి అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. అయితే స్ట్రీమింగ్ తేదీ, భాషల వివరాలపై నెట్‌ఫ్లిక్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. థియేటర్లలో 'ఇరుముడి'కి ప్రధాన బలంగా నిలిచిన అంశాల్లో రవితేజ నటనతో పాటు చిన్నారి నక్షత్రతో ఆయనకు సంబంధించిన ఎమోషనల్ సన్నివేశాలు కూడా ఉన్నాయి.



## అజయ్ దేవగణ్ దృశ్యం 3 ట్రైలర్ రిలీజ్

బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవగణ్ మోస్ట్ అవేటెడ్ సస్పెన్స్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ చిత్రం 'దృశ్యం 3: ది కన్‌క్లూజన్' ట్రైలర్ విడుదలైంది. విజయ్ సల్గాన్కర్ పాత్రలో మరోసారి అజయ్ దేవగణ్ ప్రేక్షకులను మైమరిపించడానికి సిద్ధమయ్యారు. గత రెండు భాగాలు సంచలన విజయం సాధించడంతో, ఈ మూడో భాగంపై ప్రేక్షకుల్లో మరియు సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో అజయ్ దేవగణ్, టబు, శ్రియా శరన్, జైదీప్ అహ్లావత్, ప్రకాష్ రాజ్, రజత్ కపూర్, ఇషితా దత్తా, మృణాల్ జాదవ్, కమలేష్ సావంత్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, అభిషేక్ పాఠక్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సస్పెన్స్ క్రైమ్ డ్రామాను అక్టోబర్ 2న గాంధీ జయంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఇక విడుదల చేసిన ట్రైలర్ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచేస్తుంది. ఈసారైనా విజయ్ సల్గాన్కర్ పోలీసులకు చిక్కుతాడా లేదా అనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది.

## శేఖర్ కమ్ముల హీరోలు నచ్చరు:
### సందీప్ రెడ్డి వంగా





టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న తాజా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఎపిక్'. '90'ం' వెబ్ సిరీస్ ఫేమ్ ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన సందీప్ వంగా చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. ఈ వేడుకలో భాగంగా 'ఎపిక్' టీజర్‌లో ఉన్న ఒక విలక్షణమైన డైలాగ్‌పై ఆసక్తికర చర్చ నడిచింది. చిత్రంలో "ఇది శేఖర్ కమ్ముల సినిమాలో హీరో లాంటి అబ్బాయికి, సందీప్ రెడ్డి వంగా సినిమాలో హీరో లాంటి అమ్మాయికి మధ్య జరిగే ప్రేమకథ" అనే డైలాగ్ ఉంది. ఈ సంభాషణపై యాంకర్ సుమ అడిగిన ప్రశ్నకు సందీప్ వంగా తనదైన శైలిలో స్పందించారు. ఈ సందర్భంగా సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. నేను చాలా స్పష్టంగా చెబుతున్నాను.. నాకు శేఖర్ కమ్ముల సినిమాల్లో హీరోలు అసలు నచ్చరు. అయితే, ఆయన చిత్రాల్లోని హీరోయిన్ల పాత్రలు, డిజైనింగ్ మాత్రం అద్భుతంగా ఉంటాయి. 'ఎపిక్' టీజర్‌లో ఈ డైలాగ్ వినడానికి ఎంతో ఆసక్తికరంగా అనిపించింది. శేఖర్ కమ్ముల హీరో లాంటి అబ్బాయి, నా సినిమాల్లోని హీరో లాంటి అమ్మాయి కలయిక అనే కాన్సెప్ట్ సినిమాపై అంచనాలను పెంచేసింది అని పేర్కొన్నారు. భిన్నమైన ఆలోచనాధోరణి, విభిన్నమైన క్యారెక్టరైజేషన్లతో టాలీవుడ్‌లో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శేఖర్ కమ్ములపై సందీప్ వంగా చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం సినీ వర్గాల్లోనూ, నెట్టింటనూ హాట్ టాపిక్‌గా నిలిచాయి.




## పచ్చిగా..
### 'లస్ట్ స్టోరీస్ 3' ట్రైలర్!

ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బోల్డ్ అంథాలజీ సిరీస్ 'లస్ట్ స్టోరీస్ 3' అధికారిక ట్రైలర్‌ను విడుదల చేసింది. ఆధునిక కాలంలో ప్రేమ, కోరికలు, మానవ సంబంధాల్లోని సంక్లిష్టమైన భావోద్వేగాల చుట్టూ అల్లుకున్న ఈ కథలు గత భాగాల కన్నా మరింత బోల్డ్‌గా ఉండనున్నట్లు ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. ఈ సిరీస్ సెప్టెంబర్ 18 నుంచి హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ ఆంథాలజీలో నలుగురు ప్రముఖ దర్శకులు నాలుగు విభిన్నమైన లఘు చిత్రాలను తెరకెక్కించారు. విక్రమాదిత్య మోత్వానే, కిరణ్ రావ్, శకున్ బాత్రా, విశాల్ భరద్వాజ్ వంటి దిగ్గజ దర్శకులు తమదైన శైలిలో ఒక్కో కథను రూపొందించారు. దీంతో ఈ సిరీస్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక, ఇందులో కొంకణా సేన్ శర్మ, రాధికా ఆప్టే, విజయ్ వర్మ, అభిషేక్ బెనర్జీ, అలీ ఫజల్, రాధికా మదన్, అదితి రావు హైదరి, సిద్ధార్థ్ వంటి ప్రముఖ నటీనటులు ప్రధాన పాత్రల్లో నటించారు. రియల్ లైఫ్ కపుల్ నటుడు సిద్ధార్థ్, అదితి రావు హైదరీ కొన్ని రొమాంటిక్ సీన్స్‌లో నటించారు. విభిన్నమైన కథనాలతో రాబోతున్న ఈ ఆంథాలజీ సిరీస్ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

## ప్రేక్షకుల తీర్పును గౌరవిస్తున్నా: యశ్

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ నటించిన 'టాక్సిక్' చిత్ర ఫలితంపై ఆయన స్పందన ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. యశ్ సన్నిహితుడైన జైదేవ్ ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, సినిమా విడుదల అనంతరం తాను యశ్‌తో రెండుసార్లు మాట్లాడానని వెల్లడించారు. ఆ సంభాషణలో యశ్ ఏమన్నారో జైదేవ్ వివరించారు. జైదేవ్‌తో యశ్ మాట్లాడుతూ, "సినిమా ఫలితం గురించి ఆందోళన చెందవద్దు. దాన్ని ప్రేక్షకుల నిర్ణయానికే వదిలేద్దాం. రాబోయే రోజుల్లో మనం చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి" అని పేర్కొన్నట్లు జైదేవ్ తెలిపారు. యశ్ ధైర్యంగా ఈ మాటలు చెప్పినప్పటికీ, ఆయన గొంతులో మాత్రం స్వల్ప నిరాశ కనిపించిందని జైదేవ్ అభిప్రాయపడ్డారు. సినిమా ఫలితంతో సంబంధం లేకుండా ప్రేక్షకుల తీర్పే అంతిమమని జైదేవ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం యశ్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో అభిమానుల మధ్య చర్చనీయాంశమయ్యాయి. తదుపరి ప్రాజెక్టులపై దృష్టి సారించాలన్న యశ్ నిర్ణయాన్ని అభిమానులు హర్షిస్తున్నారు.





## ఒక్క మెతుకు పొలిమేర దాటదు!

రౌడీ హీరో విజయ్ దేవరకొండ చాలా కాలం తర్వాత తన అభిమానులు కోరుకుంటున్న అసలైన మాస్ అవతారంలోకి మారిపోయారు. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. తాజాగా ఈ చిత్రం నుంచి విడుదలైన టీజర్ సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తూ సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చింది. టీజర్ ఆద్యంతం భావోద్వేగభరితంగా, ఉత్కంఠగా సాగింది. బ్రిటిష్ పాలనలో 'అన్నపూర్ణ దేశం' ఆకలితో అలమటిస్తున్న దృశ్యాలు, గుప్పెడు గింజల కోసం ప్రజలు పడుతున్న కష్టాలు హృదయాలను కదిలించాయి. ఈ క్రమంలో విజయ్ దేవరకొండ ఎంట్రీ, ఆయన చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ టీజర్‌కే హైలైట్‌గా నిలిచాయి. "సింగనమల బొబ్బిలి రణబాలిరా నీ అక్కా..!! ఆ కొండమీదున్న మా భద్ర మల్లన్న మీద ఆనా.. నేను కాయలి కాస్తుండగా.. ఒక్క మెతుకు కూడా పొలిమేర దాటదు చెబుతున్నా" అంటూ విజయ్ చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్ గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఆయన బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, పాత్రలో లీనమైన తీరు మునుపటి చిత్రాలకు భిన్నంగా ఉన్నాయి. 1854–1878 మధ్య కాలంలో, ముఖ్యంగా 1876–78లో వచ్చిన భయంకరమైన కరవు నేపథ్యంలో ఈ చిత్రం వాస్తవ సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కుతున్నట్టు టీజర్ స్పష్టం చేసింది. "సముద్రాలు దాటి వచ్చిన రాకాసులు కరవు రాక్షసులుగా మారితే.. ఆకలితో చనిపోయిన 80 లక్షల మంది ఆవేశాన్ని సమాధి చేయలేరు" వంటి వాక్యాలు కథలోని తీవ్రతను, పోరాట స్ఫూర్తిని తెలియజేస్తున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, టీ-సిరీస్ సమర్పిస్తోంది. విజయ్ దేవరకొండకు జోడీగా రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ క్రూరమైన ప్రతినాయకుడిగా కనిపించనున్నారు.



# ఆసియా గేమ్స్‌కు వరదల ముప్పు!

జపాన్‌లో జరగబోతున్న ఆసియా గేమ్స్‌కు భారీ వర్షాలు, వరద ముప్పు పొంచి ఉంది. ఇప్పటికే అక్కడ అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదవుతున్నాయి. గేమ్స్ జరిగే నగోయా ప్రాంతంలో కూడా వర్షాలు పడుతుండటంతో అథ్లెట్లను ఇక్కడి నుంచి అత్యవసరంగా మరో చోటుకు తరలించారు. దీంతో రాబోయే రోజుల్లో కూడా వర్షాలు పడితే.. ఆసియా గేమ్స్ నిర్వహణే కష్టతరమవుతుంది. దీంతో ఈ గేమ్స్ నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. జపాన్‌లోని నగోయా పట్టణంలో ఆసియా గేమ్స్ సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్నాయి. ఇందుకోసం వివిధ దేశాలకు చెందిన క్రీడాకారులు ఇప్పటికే జపాన్ చేరుకున్నారు. కొన్ని గేమ్స్‌కు సంబంధించిన పోటీలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. అనేక దేశాలకు చెందిన అథ్లెట్లు జపాన్ చేరుకుంటున్నారు. 36 క్రీడలకు సంబంధించిన 503 మంది అథ్లెట్లు ఇందులో పాల్గొంటున్నారు. వీరిలో 269 మంది పురుషులు, 234 మంది స్త్రీలు ఉన్నారు. ఆసియా క్రీడలకు వేదిక కానున్న నగోయా పట్టణంలో ప్రస్తుతం భారీ వర్షాలు పడుతున్నాయి. మంగళవారం ఒక్క గంటలోనే 104 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో ఈ నగరలో ఉన్న వందలాది మంది అథ్లెట్లు, ఇతర క్రీడాకారుల్ని యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం సురక్షిత ప్రాంతాలకు తరలించింది. కొన్ని షిప్పింగ్ కంటైనర్లలోనే క్రీడాకారులకు వసతి ఏర్పాటు చేయగా.. వారిని కూడా ప్రభుత్వం ఇతర ప్రాంతాలకు తరలించింది. ఇక్కడి తాత్కాలిక షెల్టర్లలో 400 మంది వరకు క్రీడాకారులు, ఇతర సిబ్బంది బస చేస్తున్నారు. అయితే, వర్షాలు, వరదల వల్ల క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందీ లేదని, అందరూ సురక్షితంగా ఉన్నారని జపాన్ అధికారులు వెల్లడించారు. అలాగే, క్రీడలు జరిగే వేదికలకు కూడా ఏ ఇబ్బందీ లేదన్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారమే క్రీడలు జరుగుతాయని స్పష్టం చేశారు. అయితే, క్రీడాకారులకు ఏర్పాటు చేసిన వసతి ప్రదేశాల్లో కొన్ని చోట్ల నీళ్లు కురుస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. మరోవైపు నగోయా పట్టణంలోని అనేక ప్రాంతాలు నీట మునిగాయి. సబ్ వేలు, బస్సు సర్వీసుల్ని తాత్కాలికంగా నిలిపివేశారు. ఇంకా భారీ వరద ముప్పు పొంచి ఉందని స్థానిక అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.



# పాండ్యా రీఎంట్రీ!

## ఆస్ట్రేలియాతో భారత్-ఏ సిరీస్‌కు ఎంపిక

**టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టేందుకు రంగం సిద్ధమైంది. 'ఆస్ట్రేలియా-ఏ'తో జరిగే వన్డే సిరీస్‌కు ఎంపిక చేసిన 'భారత్-ఏ' జట్టులో పాండ్యాకు చోటు దక్కింది. అయితే అతడి రీఎంట్రీ ఫిట్‌నెస్ పరీక్షలో నెగ్గడంపై ఆధారపడి ఉంది. గాయాల కారణంగా పాండ్యా కొంతకాలంగా క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు.**

ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ పరీక్షకు హాజరుకానున్నాడు. అందులో పాస్ అయితే ఆస్ట్రేలియా-ఏతో వన్డే సిరీస్‌లో ఆడనున్నాడు. సుమారు ఐదు నెలల తర్వాత పాండ్యా తిరిగొచ్చే అవకాశం ఉంది. ఆస్ట్రేలియా-ఏతో భారత్-ఏ రెండు నాలుగు రోజుల మ్యాచ్‌లు, మూడు వన్డేలు ఆడనుంది. సెప్టెంబర్ 22 నుంచి పుదుచ్చేరిలో సిరీస్ మొదలవుతుంది. నాలుగు రోజుల మ్యాచ్‌లకు దేవదత్ పడిక్కల్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. వన్డే జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ సారథ్యం వహించనున్నాడు. పడిక్కల్ అతడికి డిప్యూటీగా ఉంటాడు. వన్డే జట్టులో పాండ్యాతో పాటు సాయి సుదర్శన్, రజత్ పాటిదార్, ప్రియాన్ష్ ఆర్య, నమన్ ధీర్ వంటి ఆటగాళ్లకు చోటు దక్కింది. పాండ్యా ఫిట్‌గా తేలితే భారత్-ఏకు అతడి ఆల్‌రౌండ్ సామర్థ్యం అదనపు బలంగా మారనుంది. వన్డే మ్యాచ్‌లు అక్టోబర్ 6, 9, 11 తేదీల్లో జరగనున్నాయి. పాండ్యా ఫిట్‌నెస్ పరీక్షలో ఎలా రాణిస్తాడన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.





# న్యూజిలాండ్‌లో టీమిండియా క్రేజ్

## హాట్ కేకుల్లా అమ్ముడవుతున్న టికెట్లు!

న్యూజిలాండ్‌లో భారత క్రికెట్ జట్టు పర్యటనకు ముందే అభిమానుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. ఆరేళ్ల విరామం తర్వాత టీమిండియా అక్కడ పర్యటిస్తుండటంతో టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. ఈ అంతర్జాతీయ హోమ్ సమ్మర్ సీజన్ కోసం ఇప్పటికే 50,000కు పైగా టికెట్లు అమ్ముడయ్యాయని న్యూజిలాండ్ క్రికెట్ అధికారికంగా ప్రకటించింది. దీంతో సిరీస్‌పై ఉన్న అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో స్పష్టమవుతోంది. భారత జట్టు అక్టోబర్ 22 నుంచి న్యూజిలాండ్‌లో పర్యటించనుంది. ఈ టూర్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టు మ్యాచ్‌లు జరగనున్నాయి. అయితే, అభిమానుల నుంచి ముఖ్యంగా టీ20 మ్యాచ్‌లకు భారీ డిమాండ్ కనిపిస్తోంది. క్రైస్ట్‌చర్చ్‌లో జరగనున్న రెండో టీ20 మ్యాచ్‌కు సంబంధించి ఇప్పటికే 75 శాతం టికెట్లు అమ్ముడుపోయాయని న్యూజిలాండ్ క్రికెట్ తెలిపింది. టికెట్ల అమ్మకాలు ప్రారంభమైన కొద్దిరోజుల్లోనే ఈ స్థాయి స్పందన రావడం విశేషం. అభిమానుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని ఈడెన్ పార్క్ స్టేడియంలో ఆరో అంతస్తు (సిక్స్త్ టైర్) సీటింగ్‌ను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు న్యూజిలాండ్ క్రికెట్ ప్రకటించింది. అక్టోబర్ 30న జరిగే నాలుగో టీ20 మ్యాచ్ కోసం ఈ అదనపు సీట్లను కేటాయించారు. భారత్ 2019లో పర్యటించిన తర్వాత ఈడెన్ పార్క్‌లో ఈ స్థాయి సీటింగ్ తెరవడం ఇదే తొలిసారి. గతంలో 2015 ప్రపంచకప్, 2018లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్ సందర్భంగా మాత్రమే ఇలా అదనపు సీట్లను తెరిచారు. ఇటీవలే ముగిసిన 2026 టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్, న్యూజిలాండ్ తలపడటంతో ఈ టూర్‌పై మరింత ఆసక్తి పెరిగింది. టికెట్ల అమ్మకాలపై న్యూజిలాండ్ క్రికెట్ హెడ్ ఆఫ్ మార్కెటింగ్ టిమ్ ఎల్లిస్ మాట్లాడుతూ.. "భారత్ పర్యటనపై నెలకొన్న ఉత్సాహానికి ఈ స్పందనే నిదర్శనం. ఏళ్ల తర్వాత ఈడెన్ పార్క్‌లో టాప్ లెవల్ సీటింగ్‌ను తెరవడం చాలా ఆనందంగా ఉంది. అభిమానులకు అద్భుతమైన అనుభూతిని అందించడానికి మ్యాచ్‌ల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు ప్లాన్ చేస్తున్నాం" అని వివరించారు.



# ఆగని ఇషాన్ వేట

## మరోసారి విధ్వంసం

### ఈస్ట్ జోన్‌కు 584 పరుగుల ఆధిక్యం

### పరుగు తేడాలో తిలక్ వర్మ సెంచరీ మిస్

దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో సౌత్ జోన్‌పై ఈస్ట్ జోన్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించి తన పట్టును మరింత బిగించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా బుధవారం జరిగిన నాలుగో రోజు ఆటలో, కెప్టెన్ ఇషాన్ కిషన్ (80), శిఖర్ మోహన్ (52) అద్భుతమైన హాఫ్ సెంచరీలతో రాణించారు. దీంతో ఆట ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ ఏకంగా 584 పరుగుల భారీ ఆధిక్యం సాధించి, టైటిల్‌ను దాదాపు ఖాయం చేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 372 పరుగుల భారీ ఆధిక్యం ఉన్నప్పటికీ, ఈస్ట్ జోన్ ఫాలో ఆన్ విధించకుండా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. అయితే, ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (8), అభిమన్యు ఈశ్వరన్ (0) విఫలమవడంతో ఆరంభంలో తడబడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్, శిఖర్ మోహన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 170 బంతుల్లో 126 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. ముఖ్యంగా ఇషాన్ కిషన్ తనదైన శైలిలో విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించాడు. కేవలం 98 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 80 పరుగులు చేశాడు. విజయ్ వేసిన ఒకే ఓవర్లో రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో 20 పరుగులు రాబట్టి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరో భారీ షాట్‌కు ప్రయత్నించి కిషన్ ఔటవగా, నిలకడగా ఆడిన శిఖర్ మోహన్ (52) కూడా పెవిలియన్ చేరాడు. అంతకుముందు, ఉదయం సెషన్‌లో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌత్ జోన్ 336 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ తిలక్ వర్మ అద్భుత పోరాట పటిమ కనబరిచాడు. అయితే, దురదృష్టవశాత్తూ ఒక్క పరుగు తేడాతో తన తొమ్మిదో ఫస్ట్‌క్లాస్ సెంచరీని చేజార్చుకున్నాడు. 99 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కౌనైన్ ఖురేషీ బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి నిరాశగా వెనుదిరిగాడు. మరో ఎండ్‌లో సీవీ మిలింద్ (43) అతనికి చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత సౌత్ జోన్ ఇన్నింగ్స్ త్వరగా ముగిసింది. ముఖేష్ కుమార్ 3 వికెట్లతో రాణించాడు. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. కుమార్ కుశాగ్ర (34 నాటౌట్), ఖురేషీ (26 నాటౌట్) క్రీజులో ఉన్నారు. చివరి రోజు ఆట నామమాత్రమే కాగా, ఈస్ట్ జోన్ విజయం లాంఛనమేనని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

# అల్కరాజ్‌కు అవుట్

## షాకిచ్చిన షెల్టన్



టెన్నిస్ ప్రపంచంలో పెను సంచలనం నమోదైంది. యూఎస్ ఓపెన్ డిఫెండింగ్ ఛాంపియన్, స్పెయిన్ సంచలనం కార్లోస్ అల్కరాజ్‌కు అమెరికా యువ కెరటం బెన్ షెల్టన్ భారీ షాకిచ్చాడు. హోరాహోరీగా సాగిన క్వార్టర్ ఫైనల్ పోరులో అద్భుతమైన ఆటతీరుతో అల్కరాజ్‌ను మట్టికరిపించి సెమీ ఫైనల్‌లోకి దూసుకెళ్లాడు. ఈ ఉత్కంఠభరిత పోరుపై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించారు. బుధవారం జరిగిన ఈ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆద్యంతం అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. మొత్తం 4 గంటల 28 నిమిషాల పాటు సాగిన ఈ ఐదు సెట్ల థ్రిల్లర్‌లో షెల్టన్ 6-7(5), 6-1, 6-3, 1-6, 7-6(10/7) తేడాతో అల్కరాజ్‌పై విజయం సాధించాడు. నిర్ణయాత్మక ఐదో సెట్ టైబ్రేక్‌కు దారితీయగా, షెల్టన్ తన నరాలపై పూర్తి నియంత్రణతో ఆడి చారిత్రక విజయాన్ని అందుకున్నాడు. 146 మైళ్ల వేగంతో ఏస్ సంధించి మ్యాచ్‌ను ముగించాడు. యూఎస్ ఓపెన్ చరిత్రలోనే అత్యంత ఆలస్యంగా ముగిసిన మ్యాచ్‌గా ఇది రికార్డు సృష్టించింది. ఈ మ్యాచ్ తెల్లవారుజామున 3.33 గంటలకు ముగిసింది. గతంలో ఈ రికార్డు కూడా అల్కరాజ్ (అర్ధరాత్రి తర్వాత 2.50 గంటలకు ముగిసింది) పేరు మీదే ఉండటం గమనార్హం. ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌ను ఉద్దేశించి భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ 'ఎక్స్' వేదికగా స్పందించాడు. "ఇది అద్భుతమైన టెన్నిస్! ఒకరు మ్యాచ్ గెలుస్తారనుకున్న ప్రతిసారీ, మరొకరు అద్భుతంగా పుంజుకున్నారు. చివరికి కొన్ని పాయింట్ల తేడాతో ఫలితం తేలింది. అద్భుతంగా ఆడావు బెన్ షెల్టన్! కార్లోస్, ఇది కఠినమైన ఓటమి. గాయం తర్వాత పునరాగమనం చేసి ఆడటం వల్ల ఇది మరింత కష్టంగా ఉంటుంది" అని పోస్ట్ చేశాడు. ఈ విజయంతో అల్కరాజ్ 18 మ్యాచ్‌ల గ్రాండ్‌స్లామ్ విజయ పరంపరకు షెల్టన్ అడ్డుకట్ట వేశాడు. ఇది షెల్టన్ కెరీర్‌లోనే అతిపెద్ద విజయంగా నిలిచింది. గాయం కారణంగా సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగిన అల్కరాజ్.. రోజర్ ఫెదరర్ తర్వాత యూఎస్ ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకున్న ఆటగాడిగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. కానీ, క్వార్టర్స్‌లోనే అతని ప్రయాణం ముగిసింది. మాంట్రియల్‌లో తన రెండో ఏటీపీ మాస్టర్స్ 1000 టైటిల్ గెలిచి మంచి ఫామ్‌లో ఉన్న షెల్టన్.. 2023 తర్వాత మళ్లీ యూఎస్ ఓపెన్ సెమీ ఫైనల్‌కు చేరుకున్నాడు. సెమీస్‌లో మరో అమెరికన్ ఆటగాడు ఫ్రాన్సెస్ టియాఫోతో తలపడనున్నాడు. వీరిద్దరూ తమ తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ బెర్త్ కోసం పోటీ పడనున్నారు. ఈ విజయంతో ఈ ఏడాది యూఎస్ ఓపెన్‌లో బెన్ షెల్టన్ అతిపెద్ద ఆకర్షణగా నిలిచాడు.



# బీబీఎల్‌లో ఐపీఎల్ ఓనర్ల పెట్టుబడులు!

ఆస్ట్రేలియా దేశవాళీ టీ20 లీగ్, బిగ్ బ్యాష్ లీగ్ (బీబీఎల్)లో ప్రైవేట్ పెట్టుబడులకు అనుమతిస్తూ క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) తీసుకున్న సంచలన నిర్ణయం ప్రపంచ క్రికెట్‌లో సరికొత్త చర్చకు దారితీసింది. ఇప్పటివరకు ప్రధాన క్రికెట్ దేశాల్లో ప్రైవేట్ యాజమాన్యానికి దూరంగా ఉన్న ఏకైక లీగ్‌గా నిలిచిన బీబీఎల్, ఇప్పుడు తన తలుపులు తెరిచింది. 2027-28 సీజన్ నుంచి మెల్‌బోర్న్ రెనెగేడ్స్ జట్టును 100శాతం ప్రైవేట్ సంస్థలకు విక్రయించడంతో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నిర్ణయంతో ఐపీఎల్ ఫ్రాంచైజీల యజమానులకు ప్రపంచవ్యాప్తంగా తమ ప్రాబల్యాన్ని విస్తరించుకునేందుకు ఒక భారీ అవకాశం లభించినట్లయింది. ఇప్పటికే రిలయన్స్ ఇండస్ట్రీస్, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, ఆర్‌పీ-సంజీవ్ గోయెంకా గ్రూప్, జీఎంఆర్/జేఎస్‌డబ్ల్యూ వంటి దిగ్గజ సంస్థలు భారత్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, యూఏఈ, అమెరికా, యూకేలలోని టీ20 లీగ్స్‌లో జట్లను కొనుగోలు చేసి తమదైన ముద్ర వేశాయి. ఇప్పుడు బీబీఎల్‌లో అడుగుపెట్టడం ద్వారా కామెరాన్ గ్రీన్, టిమ్ డేవిడ్, గ్లెన్ మాక్స్‌వెల్ వంటి టాప్ స్టార్ ఆటగాళ్లకు ఏడాది పొడవునా వివిధ లీగ్స్‌లో ఒకే బ్రాండ్ గొడుగు కిందకు తీసుకొచ్చేందుకు, మల్టీ-టోర్నమెంట్ కాంట్రాక్టులు ఆఫర్ చేసేందుకు మార్గం సుగమం అవుతుంది. బీబీఎల్ ప్రైవేటీకరణకు తలుపులు తెరిచినప్పటికీ, క్రికెట్ ఆస్ట్రేలియా పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం లేదు. నియంత్రిత పద్ధతిలో ఈ ప్రక్రియను చేపట్టనుంది.

ఈవార్తలు
# ప్రజావాణి
గురువారం 10-9-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# అమెరికానే అసలు దోషి

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చమురు కేవలం ఒక ఇంధనం కాదు.. ప్రతి దేశ అభివృద్ధి చక్రాన్ని తిప్పే కీలక శక్తి. రవాణా నుంచి వ్యవసాయం వరకు, పరిశ్రమల నుంచి విద్యుత్ ఉత్పత్తి వరకు చమురు ధరల ప్రభావం ప్రతి రంగంపైనా ఉంటుంది. అలాంటి చమురు ధరలు ఒక్కసారిగా ఎగబాకితే దాని ప్రభావం సామాన్యుడి వంటింటి నుంచి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వరకు కనిపిస్తుంది. ప్రస్తుతం అదే జరుగుతోంది. బ్రెంట్ ముడిచమురు ధర 100 డాలర్లను దాటడం ప్రపంచ దేశాల్లో మళ్లీ ద్రవ్యోల్బణ భయాలను పెంచుతోంది. అయితే ఈ పరిస్థితికి కేవలం చమురు ఉత్పత్తి దేశాలనే బాధ్యులను చేయడం ఎంతవరకు సమంజసం? ప్రపంచ చమురు మార్కెట్‌లో అస్థిరతకు అమెరికా అనుసరిస్తున్న సైనిక, ఆర్థిక, ఆంక్షల విధానాలు ఎంతవరకు కారణమన్న ప్రశ్నను కూడా అడగాల్సిన సమయం వచ్చింది. ఇరాన్‌పై అమెరికా ఒత్తిడి, సైనిక చర్యలు, చమురు రవాణాపై ఆంక్షలు.. మరోవైపు మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు.. ఇవన్నీ కలసి ప్రపంచ చమురు సరఫరా వ్యవస్థను ప్రమాదంలోకి నెట్టాయి. ప్రపంచంలోని అత్యంత కీలకమైన చమురు రవాణా మార్గాల్లో ఒకటైన హోర్ముజ్ జలసంధి చుట్టూ ఉద్రిక్తతలు పెరగడంతో చమురు సరఫరాపై అనిశ్చితి పెరిగింది. ఫలితంగా నిల్వలు తగ్గిపోతుండగా ధరలు మాత్రం పైపైకి ఎగబాకుతున్నాయి. అమెరికా ఇంధన సమాచార సంస్థ కూడా 2026లో ప్రపంచ చమురు నిల్వలు భారీగా తగ్గాయని, మధ్యప్రాచ్య ఉత్పత్తి గణనీయంగా దెబ్బతిన్నదని పేర్కొంది. ఇక్కడ అసలు ప్రశ్న అమెరికాకు యుద్ధం చేసే హక్కు ఉందా లేదా అన్నది కాదు. ఒక దేశం తన భౌగోళిక, రాజకీయ ప్రయోజనాల కోసం తీసుకునే నిర్ణయాల ధరను ప్రపంచ దేశాలు ఎందుకు చెల్లించాలి అన్నదే. అమెరికా–ఇరాన్ ఘర్షణకు భారత రైతుకు సంబంధం ఏమిటి? యూరప్‌లోని సామాన్య కుటుంబానికి ఏమిటి? ఆసియాలోని చిన్న పరిశ్రమకు ఏమిటి? అయినా చమురు ధర పెరిగితే వీరంతా దాని భారాన్ని మోయాల్సిందే. చమురు ధర పెరిగితే ముందుగా పెరిగేది పెట్రోలు, డీజిల్ ధరలే కాదు. రవాణా ఖర్చులు పెరుగుతాయి. దాని ప్రభావంతో కూరగాయలు, ఆహార పదార్థాలు, ఎరువులు, పారిశ్రామిక ముడిసరుకు, నిర్మాణ సామగ్రి ధరలు పెరుగుతాయి. ఉత్పత్తి వ్యయం పెరిగి చిన్న పరిశ్రమలు కుదేలవుతాయి. ద్రవ్యోల్బణం పెరిగితే కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లపై కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. అంటే ఒక దేశం ప్రారంభించిన భౌగోళిక రాజకీయ ఘర్షణ ప్రభావం ప్రపంచంలోని కోట్లాది కుటుంబాల జీవన వ్యయంపై పడుతుంది. ఇదే సమయంలో అమెరికా ప్రపంచానికి ఒకవైపు చౌక ఇంధనం కావాలని చెబుతూనే మరోవైపు తన విదేశాంగ ప్రయోజనాల కోసం చమురు సరఫరా మార్గాలను ప్రమాదంలోకి నెట్టే చర్యలకు పాల్పడితే అది ద్వంద్వ వైఖరే అవుతుంది. యుద్ధం ప్రారంభించడం సులభం కావచ్చు.. కానీ దాని ఆర్థిక మూల్యం మాత్రం ప్రపంచం మొత్తం చెల్లించాల్సి వస్తుంది. చమురు మార్కెట్‌లో భయం కూడా ఒక ధర. సరఫరా నిజంగా తగ్గకముందే తగ్గుతుందన్న భయం ధరలను పెంచుతుంది. నౌకలు రాకపోకలు సాగించలేకపోతాయన్న అనుమానం వచ్చినా, ఒక చమురు క్షేత్రం దెబ్బతిన్నా, ఒక రవాణా మార్గం మూసుకుపోయినా అంతర్జాతీయ మార్కెట్ వెంటనే స్పందిస్తుంది. ఈ భయాన్ని మరింత పెంచేది సైనిక ఉద్రిక్తతలే. ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొంది. అమెరికా చర్యలతో ప్రపంచానికి మరో ప్రమాదం కూడా పొంచి ఉంది. ప్రతి అంతర్జాతీయ సమస్యకు ఆంక్షలు, ఆంక్షలకు ప్రతిగా ప్రతిఘటన, ప్రతిఘటనకు సైనిక చర్య అనే చక్రం కొనసాగితే ప్రపంచ వాణిజ్య వ్యవస్థ మరింత విభజనకు గురవుతుంది. దేశాలు ప్రత్యామ్నాయ చమురు వనరులు, ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు, ప్రత్యామ్నాయ చెల్లింపు వ్యవస్థలను వెతకాల్సి వస్తుంది. దీని ఫలితం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మరింత అనిశ్చితి. ప్రపంచానికి ఇప్పుడు కావాల్సింది చమురు ధరలను పెంచే శక్తి ప్రదర్శన కాదు.. ధరలను తగ్గించే శాంతి ప్రయత్నం. చమురు ఉత్పత్తి దేశాలపై రాజకీయ ఆధిపత్యం సాధించాలన్న పోటీ కంటే, అంతర్జాతీయ ఇంధన భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. హోర్ముజ్ వంటి కీలక రవాణా మార్గాలు యుద్ధభూములుగా మారకుండా ప్రపంచ దేశాలు కలసి పనిచేయాలి. అమెరికా ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక, సైనిక శక్తుల్లో ఒకటి. ఆ శక్తికి బాధ్యత కూడా అంతే పెద్దది. తన చర్యలతో ప్రపంచ చమురు మార్కెట్‌లో మంటలు రేపి, ఆ మంటల వేడిని ప్రపంచ దేశాలు భరించాల్సిన పరిస్థితి రావడం అంతర్జాతీయ సమాజానికి ఆమోదయోగ్యం కాదు.

# నేపాల్ వాదనలో తప్పు లేదు





- శశిధర్ అక్కెల

ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సంక్షోభాల్లో వాతావరణ మార్పు ఒకటి. ఇది ఇక శాస్త్రవేత్తల హెచ్చరికలకో, అంతర్జాతీయ సదస్సుల్లో చేసే ప్రసంగాలకో పరిమితమైన విషయం కాదు. మన కళ్లముందే దాని ప్రభావాలు కనిపిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.. సముద్ర మట్టాలు ఎగబాకుతున్నాయి.. అసాధారణ వర్షాలు, వరదలు, కరువులు, తుపానులు పెరుగుతున్నాయి. తీరప్రాంతాల్లోని పట్టణాలు, గ్రామాలు తరచూ జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. రాబోయే రోజుల్లో ఈ ముప్పు మరింత తీవ్రం కావచ్చన్న హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నేపాల్ వంటి దేశాలు లేవనెత్తుతున్న ప్రశ్నలను తేలికగా తీసుకోలేం. సముద్రం లేని దేశమైనా.. భూతాపం ప్రభావం నుంచి నేపాల్ తప్పించుకోలేకపోతోంది. హిమాలయాల్లో మంచు కరుగుదల, హిమ సరస్సుల విస్తరణ, ఆకస్మిక వరదల ముప్పు, వ్యవసాయంపై వాతావరణ మార్పుల ప్రభావం ఆ దేశ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. సముద్ర మట్టం పెరగడం తీర దేశాలను నేరుగా ముంచుతుంటే.. హిమాలయాల మంచు కరగడం పర్వత దేశాలకు మరో రూపంలో ప్రమాదాన్ని తెచ్చిపెడుతోంది. బాధితుల భౌగోళిక స్థానం వేరైనా.. సమస్యకు మూలం ఒక్కటే. అయితే అసలు ప్రశ్న.. ఈ పరిస్థితికి బాధ్యత ఎవరిది? భూతాపం ఒక్కరోజులో పుట్టుకొచ్చిన సమస్య కాదు. దశాబ్దాలుగా బొగ్గు, చమురు, సహజవాయువులను విపరీతంగా కాల్చడం, పరిశ్రమల నుంచి భారీగా హరితగృహ వాయువులను విడుదల చేయడం, అడవులను నరికివేయడం, ప్రకృతి వనరులను విచక్షణారహితంగా వినియోగించడం ప్రపంచ ఉష్ణోగ్రతలను పెంచాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలు చరిత్రలో అత్యధికంగా ఉద్గారాలు విడుదల చేశాయి. కానీ దాని మూల్యం మాత్రం తరచుగా తక్కువ ఉద్గారాలు చేసే అభివృద్ధి చెందుతున్న దేశాలు, పేద ప్రజలు, రైతులు, మత్స్యకారులు, తీర ప్రాంత ప్రజలు చెల్లించాల్సి వస్తోంది. ఇదే వాతావరణ న్యాయానికి సంబంధించిన అసలు ప్రశ్న.

ప్రపంచాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసిన దేశాలకు ఆ అభివృద్ధి ఫలితాలు దక్కాయి. కానీ ఆ అభివృద్ధి వల్ల వాతావరణంలో పేరుకుపోయిన ఉద్గారాల దుష్పరిణామాలను మాత్రం అందరూ సమానంగా భరించాల్సి వస్తోంది. ఇది న్యాయమా? ఒక దేశం దశాబ్దాలుగా భారీగా కార్బన్ ఉద్గారాలు విడుదల చేసి సంపద కూడబెట్టుకుంటే.. మరో దేశం తన వంతు బాధ్యత చాలా తక్కువగా ఉన్నప్పటికీ వరదలు, కరువులు, ఉష్ణతరంగాలు, పంట నష్టాలు, తాగునీటి కొరతను ఎదుర్కోవాల్సి రావడం ఎంతవరకు సమంజసం? ఇదే సమయంలో ఎల్ నినో వంటి సహజ వాతావరణ పరిణామాలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తాయి. ఎల్ నినో స్వయంగా మానవ సృష్టి కాదు. అయితే ఇప్పటికే భూతాపంతో వేడెక్కుతున్న వాతావరణ వ్యవస్థపై ఇలాంటి సహజ పరిణామాలు ప్రభావం చూపినప్పుడు తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే ఎల్ నినోను మాత్రమే నిందించడం సమస్యకు పరిష్కారం కాదు. సహజ పరిణామాలను తట్టుకునే సామర్థ్యాన్ని కోల్పోయేంతగా భూమిని మనిషి వేడెక్కిస్తున్నాడా? అన్నదే కీలకమైన ప్రశ్న. ప్రపంచ దేశాలు ప్రతి సంవత్సరం వాతావరణ మార్పుపై సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఒప్పందాలు చేసుకుంటున్నాయి. లక్ష్యాలు ప్రకటిస్తున్నాయి. కానీ నేలమీద మార్పు ఎంత? బొగ్గు వినియోగం తగ్గుతోందా? చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థలపై ఆధారపడటం తగ్గుతోందా? అడవుల నరికివేత ఆగుతోందా? పునరుత్పాదక ఇంధన వినియోగం వేగంగా పెరుగుతోందా? వాతావరణ విపత్తులతో నష్టపోతున్న పేద దేశాలకు తగినంత ఆర్థిక, సాంకేతిక సహాయం అందుతోందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు అంత ఆశాజనకంగా లేవు.

అభివృద్ధి అవసరం. కానీ ఒక దేశ అభివృద్ధి కోసం మొత్తం భూమి భవిష్యత్తును తాకట్టు పెట్టే హక్కు ఎవరికీ లేదు. ఆర్థిక వృద్ధి పేరుతో ప్రకృతిని నిరంతరం దోచుకోవడం చివరకు ఆర్థిక వ్యవస్థలనే దెబ్బతీస్తుంది. వరదల్లో మౌలిక సదుపాయాలు కొట్టుకుపోతాయి. కరువుల్లో వ్యవసాయం కుదేలవుతుంది. ఉష్ణతరంగాల్లో ఆరోగ్య వ్యవస్థలపై భారం పెరుగుతుంది. సముద్ర మట్టాలు పెరిగితే కోట్లాది ప్రజల నివాసాలు, జీవనోపాధులు ప్రమాదంలో పడతాయి. కాబట్టి ఇప్పుడు ప్రపంచానికి కావాల్సింది మరో ప్రకటన కాదు.. కార్యాచరణ. అత్యధికంగా కాలుష్యాన్ని సృష్టించిన దేశాలు తమ బాధ్యతను అంగీకరించాలి. ఉద్గారాల తగ్గింపులో ముందుండాలి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు సాంకేతికత, ఆర్థిక సహాయం అందించాలి. తీర ప్రాంతాలు, పర్వత ప్రాంతాలు, చిన్న ద్వీప దేశాలు, వాతావరణ విపత్తులకు అత్యంత సున్నితమైన సమాజాలను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. భూమి ఎవరి సొత్తూ కాదు. ఒక తరం దానిని తన ఇష్టానుసారం వినియోగించి, తర్వాతి తరాలకు వేడెక్కిన గ్రహాన్ని వారసత్వంగా ఇవ్వలేం. ప్రకృతిని నాశనం చేసినవారు అభివృద్ధి పేరుతో తమ బాధ్యత నుంచి తప్పించుకోలేరు. నేపాల్ లేవనెత్తుతున్న ప్రశ్న అందుకే ఒక దేశం ప్రశ్న మాత్రమే కాదు.. భవిష్యత్ తరాల ప్రశ్న. సముద్రతీరంలో మునిగిపోతున్న గ్రామమైనా.. హిమాలయాల్లో కరుగుతున్న మంచమైనా.. మండుతున్న ఎడారైనా.. ఎండిపోయే పంట పొలమైనా.. అన్నింటి వెనుక ఒకే హెచ్చరిక వినిపిస్తోంది. భూమి వేడెక్కుతోంది. బాధితులు పెరుగుతున్నారు. ఇక బాధ్యతను తప్పించుకునే సమయం లేదు. భూతాపానికి కారణం ఎవరో ప్రపంచానికి తెలుసు. ఇప్పుడు కావాల్సింది ఆ నిజాన్ని అంగీకరించి, బాధ్యతను నిర్వర్తించడమే.

**సాంకేతికత అభివృద్ధి చెందిన ప్రతిసారీ, దానితో పాటే దాన్ని దుర్వినియోగం చేసే మార్గాలు కూడా అభివృద్ధి చెందుతాయి. సాంకేతికత మనిషి జీవితాన్ని ఎంత వేగంగా ముందుకు తీసుకెళ్తోందో, అదే వేగంతో కొత్త ప్రమాదాలకు కూడా తలుపులు తెరుస్తోంది. ఒకప్పుడు మోసం చేయాలంటే వ్యక్తిని ప్రత్యక్షంగా కలవాల్సి వచ్చేది.**

**నేడు ఒక ఫోన్ కాల్, ఒక సందేశం, ఒక నకిలీ వెబ్‌సైట్, ఒక క్యూఆర్ కోడ్ లేదా ఒక్క లింక్ చాలు.. బ్యాంకు ఖాతా నుంచి జీవితాంతం కూడబెట్టుకున్న సొమ్ము క్షణాల్లో మాయమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కానీ ఇక్కడ అసలు ప్రశ్న ఒక్కటే.. మనిషిని మోసం చేస్తున్నది సాంకేతికతా? లేక సాంకేతికతను ఆయుధంగా మార్చుకున్న మరో మనిషా? లేక అతని నిర్ణయాన్ని ప్రభావితం చేసే భయం, అత్యాశ, అవసరం, తొందరపాటు అనే మానవ బలహీనతలా? ఈ ప్రశ్నలకు సమాధానం కోసం సాంకేతికతను మాత్రమే నిందించడం సరిపోదు.**



# విచక్షణే నిజమైన రక్షణ!



- అశోక రెడ్డి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్, 8374023454

చట్టాన్ని మాత్రమే నమ్మడం సరిపోదు. ప్రతి సమస్యకు ఒకే కోణంలో పరిష్కారం వెతకడం కూడా సరైన మార్గం కాదు. సాంకేతిక అవగాహన, న్యాయబద్ధ రక్షణ, మానవ ప్రవర్తనపై అవగాహన, సామాజిక బాధ్యత, వ్యక్తిగత విచక్షణ.. ఈ ఐదు కోణాలు కలిసినప్పుడే డిజిటల్ యుగంలో సమగ్ర రక్షణ సాధ్యమవుతుంది. మోసం వెనుక అసలు సాంకేతికత కాదు... మనిషి మనసే లక్ష్యం. సైబర్ నేరగాడు కేవలం కంప్యూటర్‌ను హ్యాక్ చేయడం కాదు. చాలా సందర్భాల్లో అతను ముందుగా మనిషి ఆలోచనను హ్యాక్ చేయడానికి ప్రయత్నిస్తాడు. మోసగాడు సాధారణంగా బాధితుడి ముందుకు నాలుగు ఆయుధాలతో వస్తాడు: 1. భయం: “మీపై కేసు నమోదైంది...”“మీ ఆధార్ నంబర్ నేరంలో ఉపయోగించారు...”“మీ ఖాతా వెంటనే బ్లాక్ అవుతుంది...” 2. అత్యాశ: “చిన్న పెట్టుబడికి భారీ లాభం...” “మీరు లక్కీ విన్నర్...” “రోజుకు వేల రూపాయలు సంపాదించండి...” 3. అవసరం: “తక్షణ రుణం...” “అత్యవసర ఉద్యోగ అవకాశం...” “వెంటనే డబ్బు సంపాదించే అవకాశం...” 4. తొందరపాటు: “ఇప్పుడే నిర్ణయం తీసుకోండి...” “ఐదు నిమిషాల్లో అవకాశం ముగుస్తుంది...” “ఇప్పుడే ఓటీపీ చెప్పండి...” ఇవన్నీ వేర్వేరు మోసాలుగా కనిపించినా, వాటి వెనుక ఉన్న ప్రధాన వ్యూహం ఒక్కటే.. “ఆలోచించే సమయాన్ని లాక్కోవడం.” మనిషి ప్రశాంతంగా ఆలోచిస్తే మోసం గుర్తించే అవకాశం ఉంటుంది. కానీ అతనిలో భయం లేదా అత్యాశను పెంచి, వెంటనే నిర్ణయం తీసుకునే పరిస్థితి సృష్టిస్తే విచక్షణ పనిచేసే అవకాశం తగ్గుతుంది. డిజిటల్ మోసాల రూపాలు మారుతున్నాయి...కానీ వ్యూహం మారడం లేదు.

సాంకేతికత మోసానికి వేదిక మాత్రమే. అసలు ఆయుధం.. మానవ బలహీనతలను గుర్తించి వాటిని ఉపయోగించుకోవడమే. అవసరమే ఆపదా? “అవసరం” అనేది సహజమైనది. కానీ అత్యవసరత పేరుతో తీసుకునే నిర్ణయం ప్రమాదకరంగా మారవచ్చు. ఉద్యోగం అవసరం., డబ్బు అవసరం.,రుణం అవసరం. పెట్టుబడి ద్వారా ఆదాయం అవసరం. అయితే మోసగాడు ఈ అవసరాన్నే అవకాశంగా మార్చుకుంటాడు. అరికట్టాల్సింది చట్టమా? స్వీయ నియంత్రణా? ఈ ప్రశ్నకు సమాధానం “ఏదో ఒకటి” కాదు. రెండూ. చట్టం లేకపోతే నేరానికి శిక్ష ఉండదు. స్వీయ నియంత్రణ లేకపోతే నేరానికి అవకాశం పెరుగుతుంది. సాంకేతిక రక్షణ లేకపోతే కొత్త మోసాలను అరికట్టడం కష్టమవుతుంది. సామాజిక అవగాహన లేకపోతే అదే మోసం వేల మందిని మళ్లీ మళ్లీ బలి తీసుకుంటుంది. అందువల్ల: చట్టం శిక్షిస్తుంది. సాంకేతికత గుర్తిస్తుంది. అవగాహన హెచ్చరిస్తుంది. కుటుంబం ప్రశ్నిస్తుంది. విచక్షణ నిర్ణయిస్తుంది. ఇవన్నీ పరస్పర ప్రత్యామ్నాయాలు కావు. ఇవి పరస్పర రక్షణ వలయం. సాంకేతిక మోసాలను ఎదుర్కోవడానికి సాంకేతికతనే ఆయుధంగా వాడుకోవాలి. బ్యాంకులు ఇప్పటికే ఏఐ ఆధారిత మోసం గుర్తింపు వ్యవస్థలను వినియోగిస్తున్నాయి.. అనుమానాస్పద లావాదేవీలను నిమిషాల్లో గుర్తించి నిలిపివేసే సాంకేతికత అందుబాటులోకి వస్తోంది. నకిలీ కాల్స్‌ను గుర్తించే ఏఐ కాలర్ ఐడీ వ్యవస్థలు, బయోమెట్రిక్ ధృవీకరణ, బ్లాక్‌చెయిన్ ఆధారిత లావాదేవీల ట్రేసింగ్ వంటివి భవిష్యత్తులో మోసాలను గణనీయంగా తగ్గిస్తాయి. మోసం సాంకేతికతతో జరిగితే, రక్షణ కూడా సాంకేతికతతోనే జరగాలి. సాంకేతికతను ఎలా ఉపయోగిస్తున్నామన్నదే అసలు ప్రశ్న. మనిషి శత్రువు తోటి మనిషా? సాంకేతికతా? లేక ఆలోచనా ధోరణేనా? ఈ ప్రశ్నకు సమాధానం కొంత సంక్లిష్టమైనదే. సాంకేతికతకు నైతికత ఉండదు. దానికి దిశ ఇచ్చేది మనిషే. కత్తితో కూరగాయలు కోయవచ్చు. అదే కత్తితో నేరం చేయవచ్చు. ఫోన్‌తో విద్య నేర్చుకోవచ్చు..అదే ఫోన్‌తో మోసం చేయవచ్చు. ఏఐతో వైద్య పరిశోధన చేయవచ్చు. అదే ఏఐతో నకిలీ వీడియోలు రూపొందించవచ్చు. వాడుకున్న వారికి వాడుకున్నంత. కాబట్టి అసలు సమస్య సాధనంలో కాదు. సమస్య సాధనాన్ని ఉపయోగించే ఆలోచనా ధోరణిలో ఉంది. మనిషి తన అవసరాన్ని తీర్చుకోవడానికి సాంకేతికతను ఉపయోగిస్తే అభివృద్ధి. మరొకరి బలహీనతను ఉపయోగించి లాభం పొందడానికి సాంకేతికతను ఉపయోగిస్తే దోపిడీ. డిజిటల్ మోసాన్ని కేవలం “ఆర్థిక నేరం”గా చూడటం సరిపోదు. ఇది వ్యక్తి జీవితాన్ని, కుటుంబాన్ని, సామాజిక విశ్వాసాన్ని ప్రభావితం చేసే బహుముఖ సమస్య. సాంకేతిక అభివృద్ధిని ఆపలేం. ఆపాల్సిన అవసరం కూడా లేదు. కానీ దాని దుర్వినియోగాన్ని అరికట్టాలి. చట్టాలు కఠినంగా ఉండాలి. విచారణ వ్యవస్థలు వేగంగా పనిచేయాలి. సాంకేతిక రక్షణ మరింత బలపడాలి. బ్యాంకులు, సంస్థలు అప్రమత్తంగా ఉండాలి..కుటుంబాలు పరస్పరం మాట్లాడుకోవాలి. పాఠశాలల నుంచి డిజిటల్ విచక్షణ నేర్పాలి. అన్నింటికంటే ముఖ్యంగా మనిషి తన నిర్ణయాన్ని తన చేతుల్లోనే ఉంచుకోవాలి. ఎందుకంటే.. చట్టం మార్గం చూపుతుంది. సాంకేతికత సాధనం ఇస్తుంది. అవగాహన హెచ్చరిస్తుంది. కుటుంబం తోడుంటుంది. కానీ చివరి నిర్ణయం తీసేది మనిషే. ఆ నిర్ణయాన్ని సురక్షితం చేసేది.. విచక్షణే. అవసరానికి ఆలోచన తోడైతే అది అవకాశం. అవసరానికి తొందరపాటు తోడైతే అది ఆపద. సాంకేతికతకు నైతికత తోడైతే అది అభివృద్ధి. సాంకేతికతకు దురాలోచన తోడైతే అది ప్రమాదం. అందుకే...మనిషి శత్రువు సాంకేతికత కాదు. మనిషి శత్రువు మరో మనిషి దురుద్దేశం కావచ్చు. అయితే దానికి తలుపులు తెరవగల బలహీనత.. ఆలోచించకుండా తీసుకునే మన నిర్ణయమే.

### మోసం జరిగితే చట్టం ఏం చేస్తుంది?

మోసం జరిగిన తర్వాత “ఎందుకు నమ్మాను?” అని బాధపడటానికి బదులు వెంటనే చర్య తీసుకోవడం ముఖ్యం. ఐటీ చట్టం 2000లోని సెక్షన్ 66సీ (గుర్తింపు దొంగతనం), 66డీ (కంప్యూటర్ వనరుల ద్వారా మోసం) కింద, అలాగే భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్)లో మోసం, నమ్మక ద్రోహానికి సంబంధించిన నిబంధనల కింద కేసు నమోదు చేయవచ్చు. మోసపూరిత లావాదేవీ గురించి బ్యాంకుకు వెంటనే లిఖితపూర్వకంగా తెలియజేస్తే, ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం బాధితుడి బాధ్యత తగ్గే అవకాశం ఉంటుంది.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
‘ప్రజావాణి’ వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి ‘ఈవార్తలు’ పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMARfrom H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004